www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY


RNI NO. APTEL/2010/33229

సంపుటి : 16 | సంచిక : 72 | గురువారం 17-04-2025 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల : రూ 2/-

విలేకరులు కావలెను

రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న 'ఫ్లాష్ఇండియా' తెలుగు దినపత్రిక మరియు మాసపత్రికల లకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుండి విలేకరులు కావలెను

ఫోన్ : 7730032999



## ట్రైన్ లో ఏటీఎంలు

- భారతీయ రైల్వే మరో సంచలన నిర్ణయం..
- ట్రైన్స్ లోనే ఏటీఎంలు ఏర్పాటు చేయాలని ప్లాన్..
- ఇప్పటికే ముంబై- మన్మాడ్ ఎక్స్ప్రెస్‌లో ఏటీఎం ఏర్పాటు..

02

## వక్ఫ్ పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ



- పది పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ
- విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం
- విచారణను రేపటికి వాయిదా వేసిన ధర్మాసనం

02

## మరోసారి సిట్ విచారణకు శ్రవణ్ రావు



- జూబ్లీహిల్స్ పీఎస్ లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు.
- అసలు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు


02

## దూకుడు పెంచిన ఈడీ

- గొర్రెల పంపిణీ స్కామ్ కేసులో ఈడీ విచారణ వేగవంతం
- వాటి ఆధారంగా పశుసం వర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావును విచారణ
- గొర్రెల స్కాంలో దళారులు మొయినుద్దీన్, ఈక్రముద్దీన్‌పై అధికారులు ఆరా

03

## ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా



- ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా
- భర్తను కౌగిలించుకుని లోపలికి పంపిన ప్రియాంకాగాంధీ

03

## రెండు కంపెనీలపై ఈడి సోదాలు



- సురానా ఇండస్ట్రీస్, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలపై ఈడీ దర్యాప్తు
- దర్యాప్తులో సంస్థల చైర్మన్‌లు, మేనేజింగ్ డైరెక్టర్లు

03



## నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చ్యువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం

- సింగరేణి గని ప్రారంభం తెలంగాణకు గర్వకారణం
- ఒడిశాలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబోతుంది
- తొమ్మిది సంవత్సరాల నిరీక్షణకు తెర, సింగరేణి గని ప్రారంభంలో కొత్త దశ : భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

సింగరేణి చరిత్రలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ అధికారులతో కలిసి ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ ను భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి విస్తరణ తెలంగాణకు గర్వకారణం అన్నారు. ఇది సింగరేణికి మాత్రమే కాదు తెలంగాణ రాష్ట్రానికి ఇది ఒక ఆనందకర సందర్భం అన్నారు. సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ బ్లాక్ ప్రారంభం తొలి మెట్టు అని, ప్రజాపాలనలోనే నైనీ బొగ్గు బ్లాక్ పై ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజాపాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణిని విస్తరిస్తామన్నారు. బొగ్గుగని ఏర్పాటుకు సహకరించిన ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్ కు భట్టి ధన్యవాదాలు తెలిపారు...

**కొత్త శకానికి నాంది: సీఎం రేవంత్ రెడ్డి**

ఒడిశాలోని అంగుల్ జిల్లాలోని నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. నైనీ బ్లాకులో బొగ్గు తవ్వకాలను ప్రారంభించిన నేపథ్యంలో సింగరేణి సంస్థకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. దాదాపు 136 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి, రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో ట్వీట్ చేసింది... మిగితా 03 పేజీలో

## చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దు

### అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుంది

అనుమతి లేకుండా చెట్లను ఎలా నరికివేస్తారు



- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంలో విచారణ జరుగగా..
- సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు
- తదుపరి విచారణ మే 15 కు వాయిదా

02

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్

- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ నియామకం
- మే 14న బాధ్యతలు స్వీకరించనున్న గవాయ్
- కేజీ బాలకృష్ణన్ తర్వాత రెండో దళితుడిగా రికార్డ్

05



## స్మితా సబర్వాల్ కు పోలీసుల నోటీసులు

- ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు పోలీసుల నోటీసులు ఇచ్చారు
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి సంబంధించిన ఏఐ ఫోటోను తన ఎక్స్ ఖాతాలో రీపోస్ట్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

**రీ పోస్టు ఎఫెక్ట్ :**

హెచ్ సీయూకు ఆనుకుని ఉన్న కంచగచ్చిబౌలి భూముల విషయంలో సోషల్ మీడియా వేదికగ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అక్కడ పర్యావరణ విధ్వంసం, జంతుజాలం ఆవాసం కోల్పోయాయని నెటిజన్లు రకరకాల వీడియోలు ఫోటోలు షేర్ చేశారు. మిగితా 02 పేజీలో

## ద్వారకా కోర్టుకు బాంబు బెదిరింపులు

- ఢిల్లీలోని ద్వారక కోర్టుకు బాంబు బెదిరింపులు..
- కోర్టు పరిసరాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తనిఖీలు..
- ఎలాంటి పేలుడు పదర్థాలు దొరకలేదు: పోలీసులు

*భారత్ లో బాంబు బెదిరింపులు పరంపర కొనసాగుతుంది. తాజాగా ఢిల్లీలోని ద్వారకా న్యాయస్థానానికి బాంబు బెదిరింపులే వచ్చాయి. అయితే, మంగళవారం నాడు రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ మెయిల్ ద్వారా ఈ హెచ్చరికలు వచ్చినట్లు గుర్తించారు. ఇవాళ ( ఏప్రిల్ 16న ) ఉదయం కోర్టు అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబు బెదిరింపుల గురించి నేటి ఉదయం 10:45 గంటల సమయంలో పీసీఆర్ కు కాల్ వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.*

05






## ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్
- మధ్యాహ్నం 12:30 గంటలకు అసెంబ్లీ ప్రాంగణంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం

02

## ఇది వారి గొప్ప విజయం

కంచ గచ్చిబౌలి(సెంట్రల్ యూనివర్సిటీ) భూముల్లో 100 ఎకరాల్లో చెట్లను నరికి వేయడం పై సుప్రీంకోర్టు మరోసారి ప్రభుత్వంపై ఫైర్ అయింది. ఈ రోజు విచారణలో భాగంగా చెట్లను నరికేందుకు అనుమతులు తీసుకున్నారా.. అన్ని కోర్టు ప్రశ్నించగా వాల్టా చట్టం ప్రకారం స్వీయ అనుమతులతో చెట్లను తొలగించామని కోర్టుకు ప్రభుత్వం తరపున న్యాయవాది తెలిపారు. దీంతో ఆగ్రహించిన కోర్టు చెట్లనరికివేతను సమర్థించుకునే ప్రయత్నం చేయవద్దని మండి పడింది. అలాగే 100 ఎకరాల్లో చెట్లను పునరుద్ధరించే ప్రణాళిక తో ముందుకు రావాలని మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ.. విచారణను మే15కు వాయిదా వేసింది.కాగా ఈ ఆదేశాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కంచ గచ్చిబౌలిలో అడవిని మిగితా 03 పేజీలో

### అక్రమ వలసదారులకు

## ట్రంప్ బంపరాఫర్

- అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు
- తాజాగా వారికి ఓ బంపర్ఆఫర్
- ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో

05



అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు అమలు చేస్తూ వచ్చిన అమెరికా ప్రభుత్వం.. తాజాగా వారికి ఓ బంపర్ఆఫర్ ఇచ్చింది. ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో.. వారికి విమాన టికెట్లతో పాటూ

## గ్రూప్-1 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షురూ

02

ఇవాళ్టి నుంచి 21 వరకు నాంపల్లి లోని సురవరం ప్రతాపరెడ్డి వర్సిటీ లో సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

# రెండు కంపెనీలపై ఈడీ సోదాలు




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లోని రెండు ప్రముఖ కంపెనీలపై ప్రస్తుతానికి ED (ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) సోదాలు నిర్వహిస్తోంది. సురానా ఇండస్ట్రీస్, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలపై చట్టవ్యతిరేక కార్యకలాపాల అనుమానంతో ఈడీ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో ఈడి అధికారులు సోదాలు చేస్తున్నారు. చెన్నై నుంచి వచ్చిన ప్రత్యేక ఈడి బృందాలు నాలుగు ప్రాంతాల్లో ఈ సోదాలను నిర్వహిస్తున్నాయి. ఈ దర్యాప్తులో సంస్థల చైర్మన్ లు, మేనేజింగ్ డైరెక్టర్లు ప్రధానంగా విచారణ ఎదురుకోనున్నారు.సురానా గ్రూపు చెన్నైలోని ప్రముఖ బ్యాంకు నుంచి వేల కోట్ల రూపాయల రుణాలను పొందినట్లు సమాచారం. అయితే, ఆ రుణాలను తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టినట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. ఇదివరకే సురానా గ్రూపుపై సీబీఐ కేసు కూడా నమోదు అయింది. ఇక సురానా గ్రూపుకు అనుబంధంగా ఉన్న సాయి సూర్య డెవలపర్స్ సంస్థపై కూడా అనుమానాలు వ్యక్తం కావడంతో, ఈడీ సోదాలు అక్కడి కార్యాలయాల్లోను కొనసాగుతున్నాయి. ఈ రెండు సంస్థల మధ్య ఆర్థిక లావాదేవీలు, రుణ వినియోగంపై లోతుగా పరిశీలన జరుపుతోంది ఈడి. ఈ సోదాల నేపథ్యంలో హైదరాబాద్ వ్యాపార వర్గాల్లో కలకలం రేగింది.

# వక్ఫ్ పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ

- వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో 73 పిటిషన్లు

**ఢిల్లీ :** వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కోర్టులో 73 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిలో పది పిటిషన్లను ఈ రోజు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురుసభ్యుల ధర్మాసనం వాటిని విచారించింది. వక్ఫ్ చట్టరూపాన్ని ఆర్టికల్ 26 నిరోధించదని, ఆ రాజ్యాంగ నిబంధన సార్వత్రికమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందరికీ వర్తించే ఈ నిబంధన లౌకికమైన స్వభాన్ని కలిగి ఉందని స్పష్టం చేసింది. కేంద్రానికి సైతం సుప్రీం పలు ప్రశ్నలు సంధించింది. వందల ఏళ్లనాటి ఆస్తులకు పత్రాలు ఎక్కడినుంచి వస్తాయి? అని ప్రశ్నించింది. వక్ఫ్ చట్టాన్ని నిషేధించాలని జరుగుతున్న ఆందోళనలపై సుప్రీం స్పందించింది. ఆందోళనల్లో చోటు చేసుకున్న హింస బాధాకరమంది.పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్ , కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 21, 25, 26 ప్రకారం మత స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులను ఈ చట్టం ఉల్లంఘిస్తుందని పిటిషన్లు పేర్కొన్నారు. ఈ చట్టం జాతీయస్థాయి పరిణామాలను కలిగి ఉందని, ఈ పిటిషన్లను హైకోర్టుకు రిఫర్ చేయొద్దని మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. వక్ఫ్ బై యూజర్ అనేది ఎప్పటినుంచో అమల్లో ఉన్న పద్ధతి అని మరో న్యాయవాది హుజేఫా అహ్మదీ వెల్లడించారు. మరోపక్క.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ బిల్లుపై విస్తృత చర్చ జరిపిందని కేంద్రం కోర్టుకు వెల్లడించింది. అనంతరం కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది.

# కన్న కూతురిపై అఘాయిత్యం!

- విశాఖపట్నంలో మరో దారుణ ఘటన..
- కన్న కూతురిపై అత్యాచారానికి పాల్పడిన తండ్రి..

**ఆంధ్రప్రదేశ్ :**విశాఖ పట్నంలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించాడు ఓ తండ్రి. ఈ ఘటన భీమిలిలోని తగరపువలసలో పాత కృష్ణ కాలేజ్ ఎదురుగా ఉన్న షాపు దగ్గర మద్యం మత్తులో ఉన్న తండ్రి అప్పన్న కన్న కూతురిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో.. సంఘటన ప్రదేశానికి చేరుకున్న స్థానికులు అడ్డుకోని అతడికి దేహశుద్ధి చేసిన తర్వాత స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఇక, రంగంలోకి దిగిన మహిళ ఏసీపీ పెంటా రావు అత్యాచారయత్నినికి పాల్పడిన ప్రదేశాన్ని పరిశీలించింది.ఇక, నిందితుడు షిప్పింగ్ యార్డు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అయితే, మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనతో అతడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కాగా, మైనర్ బాలికను చికిత్స కోసం కేజీహెచ్ కి తరలించారు. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది. నిందితుడు అప్పన్నను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# జపాన్ పర్యాటనకు సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పటి నుంచే తెలంగాణ అభివృద్ధికి గ్లోబల్ పెట్టుబడులు అవసరమన్న దృక్పథంతో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలు ప్రారంభించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం జపాన్ పర్యటనకు నేడు వెళ్లనుంది. నేటి (ఏప్రిల్ 16) నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి టోక్యో, మౌంట్ ఫ్యూజీ, ఒసాకా, హిరోషిమా నగరాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్పెషల్ సెక్రటరీ జయేశ్ రంజన్ కూడా వెళ్లనున్నారు. గతంలో దావోస్ లో జరిగిన ఆర్థిక సదస్సులో కూడా సీఎం రేవంత్ పెట్టుబడుల కోసం పాల్గొని అనేక పెట్టుబడులను సాధించారు.టోక్యోలోని వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమవుతున్నారు. ఏప్రిల్ 17న తోషిబా ఫ్యాక్టరీని సందర్శించి కంపెనీ కార్యకలాపాలపై అవగాహన పొందనున్నారు. ఏప్రిల్ 18న గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి.. టోక్యో గవర్నర్ తో సమావేశం, పారిశ్రామికవేత్తలతో రౌండ్ టేబుల్ సమావేశం జరపనున్నారు. ఆ తర్వాత ప్రముఖ కంపెనీలైన టొయోటా, తోషిబా, ఐసిన్, ఎన్టీటీ సంస్థల సీఈఓ లతో వరుస భేటీలు షెడ్యూల్ అయ్యాయి.ఆపై సీఎం రేవంత్ రెడ్డి సుమిదా రివర్ ఫ్రంట్ , మౌంట్ ఫుజీ, అరకురయామా పార్క్, కిటాక్యూషు సిటీ ఎకో టౌన్ ప్రాజెక్టులు, ఎన్విరాన్ మెంట్ మ్యూజియం, మురసాకి రివర్ మ్యూజియాలను సందర్శించనున్నారు. అలాగే ఏప్రిల్ 21న ఒసాకాలో జరిగే వరల్డ్ ఎక్స్ పో – 2025లో తెలంగాణ పవిలియన్ ను సీఎం అధికారికంగా ప్రారంభించనున్నారు. అదేరోజు బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనబోతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక జపాన్ పర్యటన చివరరి రోజు ఏప్రిల్ 22న హిరోషిమా చేరుకుని పీస్ మెమోరియల్ సందర్శన, గాంధీ విగ్రహానికి పుష్పాంజలి, హిరోషిమా వైస్ గవర్నర్, అసెంబ్లీ చైర్మన్ లతో భేటీలు జరుగనున్నాయి. మజ్దా మోటార్స్ ఫ్యాక్టరీ, హిరోషిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని కూడా సందర్శించి చర్చలు జరుపనున్నారు.

# గ్రూప్-1 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షురూ


**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో గ్రూప్ -1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తేదీలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు ఇవాల్టి నుంచి 21 వరకు నాంపల్లి లోని సురవరం ప్రతాపరెడ్డి వర్సిటీ లో సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అదేవిధంగా టీజీపీఎస్సీ వెబ్ సైట్ లో ధ్రువపత్రాల వెరిఫికేషన్ కు ఎంపికైన అభ్యర్థుల జాబితా అందుబాటులో ఉంచామని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. పోస్టులకు ఎంపికైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల ఫొటోస్టాట్ కాపీ లను అభ్యర్థులు వాటిపై తమ సంతకాలు చేసి వెరిఫికేషన్ కు వెంట తీసుకురావాలని తెలిపారు.

# మరోసారి సిట్ విచారణకు శ్రవణ్ రావు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాపు కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో కేసులో A6గా ఓ ప్రముఖ మీడియా సంస్థ ఎండీ శ్రవణ్ రావు ఇవాళ మరోసారి జూబ్లీ హిల్స్ పీఎస్ లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. అయితే, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా ఎవరెవరిపై నిఘా ఉంచాలనే విషయంలో శ్రవణ్ రావు సూచన మేరకే నిందితులు ప్రభాకర్ రావు , ప్రణీత్ రావు తూచా తప్పకుండా అమలు చేశారని సిట్ అభియోగం మోపింది.కేసు నమోదైన వెంటనే విదేశాలకు పారిపోయిన శ్రవణ్ రావు మార్చి 29న ఎట్టకేలకు హైదరాబాద్ కు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల నుంచి సిట్ అధికారుల నోటీసులు అందుకున్న ఆయన ఇప్పటికే నాలుగు సార్లు విచారణకు హాజరయ్యారు. అయితే, నేటి విచారణలో భాగంగా శ్రవణ్ రావు సబ్మిట్ చేసిన రెండు ఫోన్లలోని డేటాను అధికారులు రికవర్ చేసే పనిలో ఉన్నారు. అసలు ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు.. మొత్తం వ్యవహారం వెనుక ఉన్న కీలక వ్యక్తులు ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. అయితే, శ్రవణ్ రావు ఇచ్చే వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు పలువురు నేతలకు నోటీసులు ఇచ్చి వారిని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయి.

# స్మితా సబర్వాల్ కు పోలీసుల నోటీసులు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ కు తెలంగాణ పోలీసులు షాకిచ్చారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఫేక్ ప్రచారం విషయంలో ఆమెకు తాజాగా నోటీసులు జారీ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ఏఐ వీడియోలు, చిత్రాల ద్వారా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా తప్పుడు ప్రచారం చేశారని, వీరి వెనుక ప్రతిపక్ష పార్టీలకు చెందిన పెద్దలు ఉన్నారని ప్రభుత్వానికి నిఘా వర్గాలు నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ తప్పుడు ప్రచారానికి పాల్పడిన ఆయా యూట్యూబ్ చానళ్లు, న్యూస్ వెబ్ సైట్లతో పాటు పలువురు నెటిజన్లకు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో స్మితా సబర్వాల్ చేసిన రీ పోస్టు ఆమె నోటీసులకు కారణం అయింది.

**రీ పోస్టు ఎఫెక్ట్ :**

హెచ్ సీయూకు ఆనుకుని ఉన్న కంచగచ్చిబౌలి భూముల విషయంలో సోషల్ మీడియా వేదికగ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అక్కడ పర్యావరణ విధ్వంసం, జంతుజాలం ఆవాసం కోల్పోయాయని నెటిజన్లు రకరకాల వీడియోలు ఫోటోలు షేర్ చేశారు. అయితే వాటిలే చాలా వరకు ఫేక్, ఏఐ ఆధారిత ప్రచారమే ఉందని ప్రభుత్వం చెప్పడంతో తాము చేసిన పోస్టులను చాలా మంది తొలగించారు. అయితే మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ఎక్స్ (ట్విట్టర్) హ్యాండిల్ పోస్టు చేసిన ఓ ఇమేజ్ ను స్మితా సబర్వాలా రీ ట్వీట్ చేశారు. హెచ్ సీయూలోపల ఉన్న మష్రూమ్ రాక్ ముందు భారీ సంఖ్యలో బుల్డోజర్లు వాటి ముందు నెమలి, జింకను గిబ్లీ శైలిలో ఉన్నట్లు ఆ ఇమేజ్ ఉంది. ఈ పోస్టుని స్మితా సబర్వాల్ రీ ట్వీట్ చేయగా ఇది ఫేక్ ఇమేజ్ అని పోలుసు గుర్తించారు. దీంతో ఈ పోస్టును రిట్వీట్ చేసిన స్మితా సబర్వాల్ కు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పీఎస్ ఎస్ హెచ్ వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ బుధవారం జాతీయ మీడియాకు వివరించారు. అయితే బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఒక కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసుల అధికారి సాక్షులను పోలీస్ స్టేషన్ కు పిలిపించి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్మితాసబర్వాల్ కు నోటీసులు వెళ్లడం దానిపై ఆమె ఎలాంటి రియాక్షన్ ఏంటి అనేది ఉత్కంఠగా మారింది.

# ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా మధ్యాహ్నం 12:30 గంటలకు అసెంబ్లీ ప్రాంగణంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ , మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ , సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, పద్మారావుగౌడ్ హాజరయ్యారు.

# పోలీసు శాఖకు అభినందనలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** దేశంలోనే అత్యుత్తమ పనితీరుతో తెలంగాణ పోలీసు శాఖ అగ్రస్థానంలో నిలిచినందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి పోలీసు శాఖకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాల్లో పోలీసింగ్ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచినట్లు 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025 తేల్చింది. ఈ నివేదికను టాటా ట్రస్ట్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ వంటి ప్రఖ్యాత సంస్థలు రూపొందించాయి. ఇందులో తెలంగాణకు గొప్ప గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని, ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ అన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడడం, నేరాలను నియంత్రించడంలో, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల నమోదులో పారదర్శకత చూపడం ద్వారా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతి, న్యాయం నిలబెట్టడంలో విజయవంతమయ్యారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాజీలేని కర్తవ్య నిర్వహణతో పోలీసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచారని, ప్రజా పాలనలో ఈ విజయం పోలీసు శాఖ సమిష్టి కృషి ఫలితమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే భవిష్యత్తులో తెలంగాణ పోలీసులు ఇలాంటి మరిన్ని విజయాలను సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



# ట్రైన్ లో ఏటీఎంలు

- భారతీయ రైల్వే మరో సంచలన నిర్ణయం..
- ట్రైన్స్ లోనే ఏటీఎంలు ఏర్పాటు చేయాలని ప్లాన్..
- ఇప్పటికే ముంబై- మన్మాడ్ ఎక్స్‌ప్రెస్‌లో ఏటీఎం ఏర్పాటు..

**న్యూఢిల్లీ :** ఇండియన్ రైల్వే మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక, ఇప్పటి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ లు, పెద్ద పెద్ద ఆఫీసుల్లోనే చూసే ఏటీఎం సేవలను.. త్వరలో కదిలే ఏటీఎంలు సైతం రానున్నాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం రైళ్లలోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోంది. అయితే, ప్రయోగాత్మకంగా సెంట్రల్ రైల్వే తొలిసారిగా ముంబై నుంచి మన్మాడ్ వెళ్లే పంచవటి ఎక్స్ ప్రెస్ లో ప్రయోగాత్మకంగా కదిలే ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలియజేశారు.కాగా, ప్రతి రోజు నడిచే ఈ పంచవటి ఎక్స్ ప్రెస్ లో.. ఓ ప్రైవేట్ బ్యాంక్ కు చెందిన ఏటీఎంను ఏసీ చైర్ కార్ కోచ్ లో ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా పేర్కొన్నారు. ఏసీ కోచ్ లో గతంలో తాత్కాలిక ప్యాంట్రీగా ఉపయోగించిన స్థలంలో ఈ ఏటీఎంను ప్రస్తుతం ఏర్పాటు చేశారు. రైలు కదులుతున్నప్పుడు భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి దీనికి షట్టర్ డోర్ ను కూడా ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి కోచ్ లో అవసరమైన మార్పులను మన్మాడ్ వర్క్ షాప్ లో చేపట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు.అయితే, ముంబై- మన్మాడ్ పంచవటి ఎక్స్ ప్రెస్ ప్రతి రోజూ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినల్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకూ ప్రయాణం కొనసాగిస్తుంది. వీటి మధ్య సుమారు ప్రయాణ దూరం 4.30 గంటలు పడుతుంది. కాగా, ఆ మార్గంలో ఈ రైలు కీలకమైంది. ఈ ట్రైన్లో ప్రయోగాత్మకంగా ఏటీఎం సేవలను అమలు చేస్తున్నారు. త్వరలోనే మిగతా మార్గాల్లోని రైళ్లలోనూ కూడా ఈ ఏటీఎంలను ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

# చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దు

- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంలో విచారణ జరుగగా..
- ప్రభుత్వంపై ధర్మాసనం సీరియస్ అయ్యింది.
- అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసినందుకు
- సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు
- తదుపరి విచారణ మే 15 కు వాయిదా



**న్యూఢిల్లీ :** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో ఈరోజు (బుధవారం) విచారణ ప్రారంభమైంది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేత్రత్వంలోని ద్విసభ్య ధర్మాసనం దీన్ని విచారించింది. చెట్లు కొట్టేసి ముందు అనుమతులు తీసుకున్నారా లేదా స్పష్టంగా చెప్పాలని విచారణలో జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. అయితే అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టుకు చెప్పారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. అనుమతులు తీసుకున్నారా లేదా అనుమతులు లేకుండా చెట్లు కొట్టేసినందుకు సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు.

**జస్టిస్ గవాయ్:** చీఫ్ సెక్రటరీని కఠినమైన చర్య నుంచి కాపాడాలనుకుంటే, ఆ వంద ఎకరాలను ఎలా పునరుద్ధరించాలో ఒక ప్రణాళికతో ముందుకు రావాలి. 1996 డిసెంబర్ లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏమాత్రం వ్యవహరించినా చూస్తూ ఊరుకోం. మూడు రోజుల సెలవుల్లో అలా చేయడానికి అంత తొందర ఏమిటి? ఆ సెలవుల్లోనే బుల్డోజర్లు తీసుకొచ్చారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు.

**అమికస్ క్యూరీ:** రూ.10 వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో చెప్పిందన్నారు.

**జస్టిస్ గవాయ్:** భూములను మార్టిగేజ్ చేశారా లేదా, అమ్ముకున్నారో లేదో తమకు అనవసరం. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అనేది ముఖ్యం.

**అభిషేక్ మను సింఘ్వి:** 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి, తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి, ఐటి పార్కు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన వివారలను కోర్టుకు చెప్పారు.

**జస్టిస్ గవాయ్:** వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలన్న విషయం పైనే మేము దృష్టి సారించాలని అంటున్నాం.

**నిరంజన్ రెడ్డి:** వంద ఎకరాల్లో జంతువులకు తీవ్ర నష్టం జరుగుతుంది. సీఎస్ ఫైల్ చేసిన అఫిడవిట్ చూస్తే ఆశ్చర్యంగా ఉందిం. వంద ఎకరాలు మార్టిగేజ్ చేసి, చెట్లు కొట్టేసి ఇప్పుడు పర్యావరణ హితమైన ఐటి పార్క్ అని చెబుతున్నారు.

**జస్టిస్ గవాయ్ :** పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం.ఆ భూముల్లో ఉన్న జంతుజాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పాలి.

**అమికస్ క్యూరీ:** సీఈసీ నివేదికలో మార్టిగేజ్ వ్యవహారం స్పష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం 144 సెక్షన్ పెట్టినా ఈ భూములను వెంటనే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి అప్పజెప్పాలి.

**జస్టిస్ గవాయ్:** మార్టిగేజ్ వ్యవహారం తమకు సంబంధం లేదు. పర్యావరణ అనుమతులు ఉన్నాయా లేదా. 1996 మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా. దెబ్బతిన్న పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో అనే విషయం మాకు ప్రధానం. మిగిలిన వ్యవహారాలతో తమకు సంబంధం లేదు. ఆర్టికల్ 142 కింద పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం. పునరుద్ధరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, మీ అధికారులను తాత్కాలికంగా జైలుకు పంపిస్తాం. ఈ మధ్యకాలంలో అక్కడ ఒక్క చెట్టైనా కొట్టరాదు. బుల్డోజర్లు తొలగించబడ్డాయా? అని జస్టిస్ ప్రశ్నించారు.

100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

# దూకుడు పెంచిన ఈడీ

- గొర్రెల పంపిణీ స్కామ్ కేసులో ఈడీ విచారణ వేగవంతం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం లో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. అయితే భారీ ఎత్తున అక్రమ లావాదేవీలు జరిగాయని తేలడంతో ఈడీ అధికారులు జోక్యం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ గొర్రెల పంపిణీ స్కాం కేసు విచారణను ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నేడు ఈడీ అధికారుల ముందు విచారణకు హాజరు కానున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా అమలైన ఈ గొర్రెల పెంపకానికి సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ అధికారులు తెప్పించుకున్నారు. దీని ఆధారంగా చేసుకొని గొర్రెల పంపిణీ అవకతవకలపై పశుసం వర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ను ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొర్రెల స్కీమ్ లో రూ.700 కోట్లు అవినీతి జరిగిందంటూ ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# ఏపీ రాజ్యసభ స్థానానికి నోటిఫికేషన్ జారీ..

- విజయ సాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయినా రాజ్యసభ సీటు..
- జనవరి 25న రాజ్యసభ స్థానానికి రాజీనామా చేసిన విజయ సాయిరెడ్డి

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ లో మరో ఎన్నికకు ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన విజయ సాయిరెడ్డి 2028 జూన్ వరకు పదవీకాలం ఉండగానే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ నేపథ్యంలోనే ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు సీఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది.

**ఎన్నికల షెడ్యూల్ ఇదే..**

ఏప్రిల్ 22 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ..
ఏప్రిల్ 30వ తేదీన నామినేషన్ల పరిశీలన
మే 2వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు
మే 9వ తేదీన రాజ్యసభ స్థానానికి ఎన్నిక, ఫలితాలు

అయితే, సంఖ్యా బలం ఆధారంగా ఎంపీ స్థానం కూటమి ప్రభుత్వానికే దక్కే అవకాశం ఉంది. కాగా, కూటమి తరపున ఏ పార్టీకి చెందిన వారికి సీటు కేటాయిస్తారన్నది ప్రస్తుతం సస్పెన్స్ గా మారింది. బీజేపీ నుంచే విజయ సాయిరెడ్డి అభ్యర్థిగా పోటీ చేస్తారని టాక్ నడుస్తుంది. దీనిపై ఢిల్లీలో ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లీక్ ఇచ్చారు. కానీ, రాజకీయం వదిలేసి.. వ్యవసాయం చేస్తానని రాజీనామా ప్రకటన చేసిన రోజు చెప్పిన సాయిరెడ్డి.. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ పర్యటనలో ప్రత్యక్షమైయ్యారు. దీంతో విజయ సాయిరెడ్డి మళ్లీ మనస్సు మార్చుకుని పొలిటికల్ లోనే ఉండనున్నారా అనే చర్చ కొనసాగుతుంది.

# ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా

- ఈడీ విచారణకు హాజరైన రాబర్ట్ వాద్రా
- భర్తను కౌగిలించుకుని లోపలికి పంపిన ప్రియాంకాగాంధీ



**ఢిల్లీ :** మనీలాండరింగ్ కేసులో రెండోరోజు విచారణకు ఈడీ కార్యాలయానికి రాబర్ట్ వాద్రా వచ్చారు. ఈ సందర్భంగా ఈడీ కార్యాలయం ఎదుట ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. విచారణకు వెళ్లే ముందు రాబర్ట్ వాద్రాను భార్య ప్రియాంకాగాంధీ కౌగిలించుకుని లోపలికి పంపించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.గురుగ్రామ్ భూమి కేసుకు సంబంధించి వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా బుధవారం వరుసగా రెండో రోజు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలోనికి వెళ్లారు. 2008 హర్యానా భూ ఒప్పందం, మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఈడీ విచారిస్తోంది. మంగళవారం దాదాపు ఐదు గంటల పాటు విచారించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PLMA) కింద ఆయన వాంగ్మూలాలను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# పార్టీ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ కీలక పిలుపు

## ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ వ్యవహారంలో ఈడీ తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ మేరకు అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే కేసుతో లింక్ అయి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా, కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు మరో ఇద్దరిపై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. ఆ ఫిర్యాదుపై ఢిల్లీ స్పెషల్ కోర్టు ఈనెల 25న విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వైఖరిని నిరసిస్తూ.. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులకు కీలక పిలుపునిచ్చారు. రేపు ఉదయం 10 గంటలకు ఈడీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగబోతున్నట్లుగా ప్రకటించారు. ఛార్జిషీట్లలో సోనియా, రాహుల్ పేర్లను కక్షపూరితంగా చేర్చారని కామెంట్ చేశారు. రాజకీయ కక్షసాధింపులను నిరసిస్తూ రేపు నగరంలోని ఈడీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నాకు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**దేశవ్యాప్తంగా నిరసనలకు ఏఐసీసీ పిలుపు..**

ఈ క్రమంలోనే 'నేషనల్ హెరాల్డ్' కేసు చార్జి షీట్ లో రాహుల్, సోనియా గాంధీ పేర్లు చేర్చడంపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా నిరసనలకు దిగేందుకు సిద్ధమైంది. ఇవాళ అన్ని రాష్ట్రాల్లోని ఈడీ కార్యాలయాల ఎదుట ధర్నాకు ఏఐసీసీ పిలుపు నిచ్చింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ సర్కార్ అధికార దుర్వినియోగానికి పాల్పడు తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రతిపక్షాలపై కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. చార్జిషిట లో తమ పార్టీ అధినేతల పేర్లు తొలగించేంద వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిది



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కంచ గచ్చిబౌలి భూముల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వ పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైనదో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బాధ్యత గల ప్రభుత్వం కావాలనే సెలవు దినాల్లో బుల్ డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు. కంచగచ్చిభూముల విషయంలో ఇవాళ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు ఓ ప్రకటనలో స్పందించారు. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం అని కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ తన రిపోర్టుతో కళ్లు తెరిపించిందన్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపన అయినట్లే ఈరోజు కూడా జరిగిందన్నారు.

**విధ్వంసమే విధానంగా..**

విధ్వంసమే విధానంగా సీఎం రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన సాగుతున్నదని ధ్వజమెత్తారు. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం సృష్టిస్తే నేడు బుల్ డోజర్లతో పర్యావరణ హననం చేశారని ఆరోపించారు. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉందని అందుకే బాధ్యతగా బీఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి నివేదిక ఇచ్చామని అందులో ఆధారాలతో సహా వాస్తవాలు వివరించామన్నారు. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లుగా తయారైన రేవంత్ కు బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలన్నారు.

# ఇది వారి గొప్ప విజయం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కంచ గచ్చిబౌలి(సెంట్రల్ యూనివర్సిటీ) భూముల్లో 100 ఎకరాల్లో చెట్లను నరికి వేయడం పై సుప్రీంకోర్టు మరోసారి ప్రభుత్వంపై ఫైర్ అయింది. ఈ రోజు విచారణలో భాగంగా చెట్లను నరికేందుకు అనుమతులు తీసుకున్నారా.. అన్ని కోర్టు ప్రశ్నించగా వాల్టా చట్టం ప్రకారం స్వీయ అనుమతులతో చెట్లను తొలగించామని కోర్టుకు ప్రభుత్వం తరపున న్యాయవాది తెలిపారు. దీంతో ఆగ్రహించిన కోర్టు చెట్లనరికివేతను సమర్ధించుకునే ప్రయత్నం చేయవద్దని మండి పడింది. అలాగే 100 ఎకరాల్లో చెట్లను పునరుద్ధరించే ప్రణాళిక తో ముందుకు రావాలని మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ.. విచారణను మే15కు వాయిదా వేసింది.కాగా ఈ ఆదేశాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. కంచ గచ్చిబౌలిలో అడవిని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం గొప్ప విజయమని చెబుతూ.. ఎక్స్లో పోస్టు పెట్టారు. అందులో ఇలా రాసుకొచ్చారు. కంచ గచ్చిబౌలిలో అడవిని పునరుద్ధరించాలని,ఈ ప్రాంతంలోని అన్ని వన్యప్రాణుల భద్రతను నిర్ధారించాలని తెలంగాణ ప్రభుత్వానికి, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ కు కోర్టు ఆదేశించడం పర్యావరణ రక్షణను కోసం పోరాటం చేసిన వారందరికీ లభించిన గొప్ప విజయం." అని రాసుకొచ్చాడు. అలాగే కోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలను బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందని, కోర్టు ఉత్తర్వులతో నైన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస జ్ఞానం వస్తుందని ఆశిస్తున్నామమని కేటీఆర్ తన ట్వీట్ లో రాసుకొచ్చారు

# ప్రభుత్వ వైఫల్యాలపై గొంతెత్తడం టెర్రరిజమా..?



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ వైఫల్యాలపై గొంతెత్తడం టెర్రరిజమా?, మా పార్టీ సోషల్ మీడియా మీద చట్ట వ్యతిరేక వేధింపులు ఆపాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టుల మీద జరుగుతున్న పోలీసు విచారణపై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆర్ఎస్పీ . కాంగ్రెస్ ప్రభుత్వం పై హాట్ కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వ 420 వాగ్దానాల మీద, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రశ్నిస్తున్న గొంతుకల మీద రేవంత్ సర్కార్ తీవ్ర నిర్బంధాన్ని ఉపయోగిస్తున్నదని తెలిపారు.ఇటీవల అక్రమ కేసులు నమోదు అయిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్రిశాంక్ ను విచారణలో భాగంగా మొబైల్ ఫోన్ కావాలని అడగడం, మరో ఆక్టివిస్టు నల్లబాలు ని అయితే మరీ ఘోరంగా బ్యాంక్ స్టేట్మెంట్లు, UPI వివరాలు, అప్పుల వివరాలు, క్రెడిట్, డెబిట్ కార్డు స్టేట్ మెంట్లు, డిష్ టివీ రీచార్జి వివరాలు, వైఫై, మొబైల్ బిల్ పేమెంట్ వివరాలు అడగడం ఆశ్చర్యకరమని అన్నారు. ఇవన్నీ మనీ లాండరింగ్ లాంటి వ్యవస్థీకృత నేరాలు పరిశోధనలో అడుగుతారని, ప్రజల పక్షాన నిలబడే సోషల్ మీడియా ఆక్టివిస్టుల మీద కాదు అని మండిపడ్డారు.ఈ ప్రశ్నావళిని మీ మంత్రుల పేషీలు, గాంధీ భవన్ లో మీ నాయకులకు ముందు పంపించండి.. ప్రజలకు చాలా మేలు జరుగుతుందని సూచించారు. ముసోలినీ-హిట్లర్ల పాలనలో కూడా అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తిన పౌరులను ఇన్ని ప్రశ్నలు అడగి ఉండరు! అంటూ.. వెంటనే బీఆర్ఎస్ సోషల్ మీడియా మీద ఈ చట్టవ్యతిరేక వేధింపులు ఆపాలని తెలంగాణ డీజీపీ కి ఆర్ఎస్ ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు.


# ఏపీ ప్రభుత్వం అక్రమంగా నీళ్లు తీసుకెళ్తుంది



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కృష్ణా నదీ జలాల వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనాన్ని తీవ్రంగా విమర్శించారు. గత రెండు నెలలుగా తమ పార్టీ చెబుతోన్న వాదనల్ని ఇప్పుడు కృష్ణా బోర్డు కూడా సమర్థించిందని తెలిపారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి వరకు అక్రమంగా 65 టీఎంసీల నీటిని తీసుకెళ్లిందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీళ్లను అక్రమంగా తరలిస్తుందన్న విషయం మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ, ఇప్పుడే కృష్ణా బోర్డు చెప్పడంతో మా మాటకు న్యాయం జరిగినట్లైందని అన్నారు.అలాగే తెలంగాణ ప్రభుత్వం ఏదో చంద్రబాబుతో లోపాయికీ ఒప్పందం చేసుకున్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పైరవీలు నమోదు చేయకుండా మౌనంగా ఉండటం వెనుక కారణం ఇదే కావచ్చని మండిపడ్డారు. ఈ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ అంశంపై ఒక్క రివ్యూకూడా చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.ప్రజలు మళ్లీ పాత రోజులకు, దరిద్రాలకు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని.. ఆయన ప్రజలను ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ అంశంపై త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ కార్యచరణ ప్రకటిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

# సీఎంకు చెడ్డ పేరు వచ్చేలా చేయను

- హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడ్డారంటూ వచ్చిన ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు
- తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ ఫహీమ్



AMEENPUR WELFARE ASSOCIATION
(Regd. No. 207/2002)
Office : Chaitanya School, Durga Nagar, Kistareddypet, Hyderabad.

President
K. Ram Reddy

Vice President :
Mohd. Ghouse

Raju Yadav

General Secretary
Mahesh Goud

Aslam Rafiq

Satish Singh

Bhopal Reddy

Treasurer
Raju Patel

Subba Rao

Organising Secretary
Yaseen Malik

Shoaib Ali

Kiran Kumar. N

K. Ramesh Raju

To,
The Chief Minister
Telangana Government

Date: 10-3-2025

Subject: Exploitation by M.A. Faheem (Chairman, Telangana Foods)

Dear Sir,

We, the members of the Ameenpur Welfare Association, would like to bring to your attention the harassment and exploitation by M.A. Faheem, Chairman of Telangana Foods, who is troubling the public in Ameenpur.

M.A. Faheem is demanding large sums of money from local residents under the pretext of Hydra (a demolition machine), stating that it was sent to our area with the help of the Chief Minister. Once the demolition was carried out, he started calling people from the local community and directly demanding hefty amounts of money, claiming that it was for the Chief Minister and other prominent ministers in Telangana. If the people refuse to pay, he threatens to send the Hydra back to demolish more properties.

He is falsely using the names of you, the Chief Minister, Sridhar Babu, Damodar Raj Narasimha, and Jaggareddy seethaka, pcc chief Mahesh goud to pressure and intimidate the public. This has caused immense distress to the people in the area, and the situation is becoming unbearable.

We, the local residents, are living in constant fear of further harassment. In light of these grave issues, we respectfully request the Chief Minister of Telangana to intervene and take immediate action against M.A. Faheem, who is causing severe distress to the community.

We trust that your intervention will help bring an end to this exploitation.

Thank you for your attention to this matter.

Sincerely,
Ameenpur Welfare Association

PRESIDENT :
VICE PRESIDENT :
GENERAL SECRETARY :

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ ఫహీమ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. హైడ్రా పేరుతో బెదిరింపు లేఖపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫహీమ్ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ అమీన్ పూర్ సంక్షేమ సంఘం పేరిట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్లుగా నిన్న (మంగళవారం) సోషల్ మీడియాలో హల్ చల్ అయ్యింది. పెద్ద మొత్తంలో డబ్బులు కావాలని , ఇవ్వకపోతే హైడ్రా ద్వారా మీ ఇల్లు కూల్చివేస్తామని ఫహీమ్ బెదిరిస్తున్నట్లుగా నకిలీ లేఖ ఒకటి వైరల్ గా మారింది. అయితే రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ లో ఫహీమ్ ఫిర్యాదు చేశారు. దీని వెనుక బీఆర్ ఎస్ హస్తం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సోషల్ మీడియాలో వైరల్ అయిన లేఖ నకిలీదిగా పోలీసులు తేల్చేశారు.ఈ వ్యవహారంపై ఎం.ఏ ఫహీమ్ మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై దుష్ప్రచారం జరిగిందన్నారు. అమీన్ పూర్ సంక్షేమ సంఘం పేరిట సోషియల్ మీడియాలో వైరల్ అయిన లెటర్ ఫేక్ లెటర్ అని చెప్పుకొచ్చారు. బీఆర్ ఎస్ వెనుక ఉండి తనపై దుష్ప్రచారం చేయిస్తోందని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రికి చెడ్డ పేరు వచ్చే పని ఎప్పటికి చేయనని స్పష్టం చేశారు. తాను డబ్బులు ఇవ్వాలని బెదిరించినట్లు కానీ హైడ్రా పేరు ఉపయోగించినట్లు కానీ ఒక్క ఆధారం కూడా లేదన్నారు. ఈ వ్యవహారంపై డీజీపీకి , హైడ్రా కమిషనర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని.. దీనిపై విచారణ జరుపుతున్నారని చెప్పారు. ప్రభుత్వానికి గానీ ముఖ్యమంత్రి గానీ చెడ్డ పేరు వచ్చేలా ఎప్పుడు చేయలేదని.. చేయను.. చేయబోనని తేల్చిచెప్పారు. దీని వెనక ఎవరున్నా పూర్తిస్థాయి దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నా చేశారు. 'నాపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం ఎవరు చేశారో నాకు తెలుసు. నాకు కొంత సమాచారం ఉంది. అవసరం వచ్చినప్పుడు వాళ్ళ పేర్లన్నీ బయట పెడతా' అని ఎంఏ ఫహీమ్ వెల్లడించారు.ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ ఫహీమ్ పెద్ద మొత్తంలో డబ్బులు కావాలని డిమాండ్ చేస్తున్నారని.. లేదంటే సీఎం సాయంతో హైడ్రా అధికారులను పంపించి ఇళ్లు కూల్చివేయిస్తామంటూ అమీన్‌పూర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.రాంరెడ్డి సీఎంకు విన్నవించినట్లు లేఖలో ఉంది. సీఎం, మంత్రులు, ఇతర నేతల పేరు చెప్పి తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని, ఫహీమ్ వల్ల భయాందోళనకు గురవుతున్నామని, అతనిపై చర్యలు తీసుకోవాలని అమీన్‌పూర్ సంఘం అధ్యక్షుడి పేరుతో లేఖ విడుదలవడం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది.

**హైడ్రా కమిషనర్ స్పందన**

దీనిపై హైడ్రా కమిషనర్ రంగానాథ్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఎంక్వైరీ చేసి రెండు మూడు రోజుల్లో నిజ నిర్ధారణ చేస్తామని' హైడ్రా కమిషనర్ ప్రకటించారు. దీనిపై ఫహీమ్ కూడా తనతో మాట్లాడారని, ఆరోపణలపై విచారణ జరపాలని కోరినట్లు రంగనాథ్ తెలిపారు.

# నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చ్యువల్ గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం

- సింగరేణి గని ప్రారంభం తెలంగాణకు గర్వకారణం
- ఒడిశాలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబోతుంది
- తొమ్మిది సంవత్సరాల నిరీక్షణకు తెర, సింగరేణి గని ప్రారంభంలో కొత్త దశ :భట్టి విక్రమార్క



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి చరిత్రలో నైనీ గని ప్రారంభం ఒక సువర్ణాధ్యాయం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ అధికారులతో కలిసి ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ ను భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి విస్తరణ తెలంగాణకు గర్వకారణం అన్నారు. ఇది సింగరేణికి మాత్రమే కాదు తెలంగాణ రాష్ట్రానికి ఇది ఒక ఆనందకర సందర్భం అన్నారు. సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ బ్లాక్ ప్రారంభం తొలి మెట్టు అని, ప్రజాపాలనలోనే నైనీ బొగ్గు బ్లాక్ పై ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజాపాలనలో ఇతర రాష్ట్రాలకు సింగరేణిని విస్తరిస్తామన్నారు. బొగ్గుగని ఏర్పాటుకు సహకరించిన ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంఝీ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్ కు భట్టి ధన్యవాదాలు తెలిపారు.తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన సింగరేణికి ఈ సందర్భంగా భట్టి అభినందనలు తెలిపారు. గని ఏర్పాటుకు సహకరించిన అంగుల్ జిల్లా ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కృషి చేస్తామని చెపారు. పెద్ద ఎత్తున సామాజిక బాధ్యత కార్యక్రమాలు చేపడతామని, 16,00మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్ కో సీఎండీ శ్రీ కృష్ణ భాస్కర్, ఒడిశా నుంచి పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా, సింగరేణి సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్త శకానికి నాంది: సీఎం రేవంత్ రెడ్డి**

ఒడిశాలోని అంగుల్ జిల్లాలోని నైనీ గని ప్రారంభించడం ద్వారా సింగరేణి కొత్త శకానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. నైనీ బ్లాకులో బొగ్గు తవ్వకాలను ప్రారంభించిన నేపథ్యంలో సింగరేణి సంస్థకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. దాదాపు 136 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి, రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎంవో ట్వీట్ చేసింది. సింగరేణి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చొరవ వల్లే తొలిసారి దేశంలోని ఇతర రాష్ట్రంలోనూ బొగ్గు గనిని ప్రారంభించడం సాధ్యమైందని, ఇది మా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. నైనీ బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించిన చారిత్రక ఘట్టం సాకారం కావడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. తెలంగాణకు మణిమకుటంగా, వేలాది కార్మిక కుటుంబాలకు జీవనాధానంగా నిలుస్తున్న సింగరేణి సంస్థ అభివృద్ధికి, విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని అన్నారు.

# సంపాదకీయం

## క్యారెట్లపై బ్రిటిషర్లు అల్లిన కథ



క్యారెట్లు తింటే కంటిచూపు మెరుగవుతుంది, కళ్లు మరింత స్పష్టంగా కనిపిస్తాయి, చీకట్లోనూ కంటిచూపు మెరుగ్గా ఉంటుంది.. అని ఎవరో ఒకరు అనడం, చెప్పడం మీరు వినే ఉంటారు.బహుశా చిన్నతనంలో మీ అమ్మ కూడా ఇలాగే చెప్పి మీతో క్యారెట్లు తినిపించి ఉండొచ్చు.కానీ, ఇందులోని నిజానిజాల సంగతి అటుంచితే, ప్రజలతో క్యారెట్లు తినిపించడానికి బ్రిటిషర్లు చేసిన ప్రచారాలు, కుట్రసిద్ధాంతాల గురించి మీకు తెలిసి ఉండకపోవచ్చు.ఎందుకంటే, రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి ఈ కుట్ర సిద్ధాంతాన్ని చాలామంది ఇంకా నమ్ముతున్నారు. అదేంటో చూద్దాం.మిత్రరాజ్యాల గెలుపునకు ఎంతో కీలకమైన ఒక టెక్నాలజీని గోప్యంగా ఉంచడం కోసం యూకే సమాచార మంత్రిత్వ శాఖ పుట్టించిన ఒక కహానీ ఇది అని ఇంపీరియల్ వార్ మ్యూజియం, మాస్ అబ్జర్వేషన్ ఆర్కైవ్స్, యూకే నేషనల్ ఆర్కైవ్స్ ఫైల్స్ ద్వారా తెలుస్తుంది.రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు 1940 సెప్టెంబర్ -1941 మే మధ్య కాలంలో బ్రిటన్‌పై నాజీలు వైమానిక బాంబు దాడులు చేసేవారు. అయితే, చీకటి కారణంగా జర్మన్ వైమానిక దళానికి ఇబ్బందులు ఎదురయ్యేవి.ప్రత్యర్థిని మరింత ముప్పుతిప్పలు పెట్టడానికి, లక్ష్యాలపై గురిపెట్టకుండా చేయడానికి నగరాల్లో బ్రిటిష్ ప్రభుత్వం బ్లాకవుట్స్ (వెలుగు లేకుండా చేయడం) విధించేది. అదే సమయంలో రాయల్ ఎయిర్‌ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) ఒక కొత్త, రహస్య రాడార్ సాంకేతికత సహాయంతో జర్మన్ ఫైటర్లను తిప్పికొట్టేది.ఏఐ రాడార్‌గా పిలిచే ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటర్‌సెప్షన్ రాడార్‌ను 1940లో ఆర్‌ఏఎఫ్ మొదటిసారిగా ఉపయోగించింది. శత్రు దేశపు విమానాలు, ఇంగ్లిష్ చానల్‌ను చేరుకోగానే ఈ రాడార్ వాటి రాకను గుర్తించగలదు.ఈ విషయం బయటకు పొక్కకుండా, ఎవరికీ తెలియకుండా ఉంచడం కోసం యూకే సమాచార మంత్రిత్వ శాఖ ఒక ఉపాయం వేసింది.ఆర్‌ఏఎఫ్ విజయానికి క్యారెట్లు కారణమంటూ ప్రచారం మొదలుపెట్టింది.1940లో ఏఐ రాడార్ సహాయంతో శత్రుదేశపు విమానాన్ని కూల్చేసిన తొలి బ్రిటిష్ పైలట్ జాన్ కన్నింగ్‌హామ్. ఆర్‌ఏఎఫ్ ఫైటర్ అయిన ఈయనకు 'క్యాట్స్ ఐస్' అనే ముద్దుపేరు ఉండేది.ఈయన కూల్చేసిన శత్రు విమానాల సంఖ్య 20. అందులో 19, రాత్రిపూట కూల్చేశారు.కన్నింగ్‌హామ్ వంటి పైలట్లు విపరీతంగా క్యారెట్లు తినడమే ఆర్‌ఏఎఫ్ విజయానికి కారణమంటూ వార్తాపత్రికలకు యూకే ప్రభుత్వం చెప్పింది.క్యారెట్లు తినడం వల్ల చీకట్లోనూ కళ్లు బాగా కనిపిస్తాయని చెప్పుకొచ్చింది. జర్మన్లను బోల్తా కొట్టించడంతో పాటు దేశంలోని ప్రజలు క్యారెట్లను తినేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యూకే ప్రభుత్వం ఈ వ్యూహాన్ని అనుసరించింది.క్యారెట్లకు హైప్ ఇవ్వడంలో ఆర్‌ఏఎఫ్ కూడా భాగమైంది.రెండో ప్రపంచ యుద్ధం కారణంగా బ్రిటన్ 1940ల్లో ఆహారం కొరత, రేషన్ కొరత, దిగుమతులు తగ్గడం సహా చాలా సమస్యలతో ఇబ్బందిపడింది.దీంతో బ్రిటన్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ క్యారెట్ల సాగును బాగా ప్రోత్సహించింది. ఆహార మంత్రిత్వ శాఖ కూడా ప్రచారాల రూపంలో ఈ కార్యక్రమంలో తన వంతు పాత్ర పోషించింది.యుద్ధం కారణంగా అందుబాటులో లేని, పరిమితంగా దొరికే ఉత్పత్తులకు క్యారెట్‌ను ప్రత్యామ్నాయంగా చూపిస్తూ చాలా సమాచారాన్ని ప్రజల్లోకి పంపించింది.'డిగ్ ఫర్ విక్టరీ' అని ప్రచారం చేస్తూ కుటుంబాలను విక్టరీ గార్డెన్స్ పేరుతో సొంతంగా కూరగాయలు, క్యారెట్లు పండించాలని కోరింది.దీంతో 1942 నాటికి పదివేల టన్నుల క్యారెట్ల మిగులును చూపించింది.రెండో ప్రపంచయుద్ధ కాలంలో ఆహార కొరత ఉన్నప్పటికీ యూకేలో జాతీయ న్యూట్రిషన్, ఆరోగ్యం మెరుగైంది. దీనికి కారణం పోషకాలు, ఖనిజాలు ఉండే ఆహారాలకు సంబంధించి ప్రభుత్వం విపరీతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది.అలాగే 'విటమిన్ ఎ' అనే సంచిని పట్టుకున్న 'డాక్టర్ క్యారెట్' అనే ఒక కార్టూన్ క్యారెక్టర్‌ను సృష్టించి ప్రజలకు క్యారెట్ వల్ల కలిగే ప్రయోజనాలను చేరువ చేసింది.రెండో ప్రపంచ యుద్ధం జరిగిన ఆరు సంవత్సరాల కాలంలో రేషన్ ఫుడ్‌కు ప్రత్యామ్నాయంగా క్యారెట్లను ప్రజలు వినియోగించేలా చేయడానికి చేయాల్సిందంతా చేసింది.రెండో ప్రపంచ యుద్ధం ఈ విధంగా క్యారెట్ పాపులారిటీని పెంచి, కిచెన్‌లో దానికి సముచిత స్థానాన్ని కల్పించింది. అందులోని పోషకాల కారణంగా ఒక ప్రధాన ఆహారంగా క్యారెట్ స్థాయిని పెంచింది.క్యారెట్లను ఒక సీక్రెట్ కోడ్‌గా రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించినట్లు ఫ్రెంచ్ సర్వీస్ ప్రసారం చేసింది.డీ డే రోజున నార్మండీ చొరబాటు గురించి ఫ్రెంచ్ వారికి చెప్పడానికి 'ద క్యారెట్స్ ఆర్ కుక్డ్, ఐ రిపీట్, ద క్యారెట్స్ ఆర్ కుక్డ్' అనే సందేశాన్ని వాడినట్లు ఫ్రెంచ్ సర్వీస్ పేర్కొంది.రెండో ప్రపంచ యుద్ధం కాలం నాటి ప్రచారాలకు, వాటి పబ్లిసిటీకి బ్రిటిష్ ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖదే బాధ్యత అని యూనివర్సిటీ ఆఫ్ లండన్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.బ్రిటిష్ ప్రభుత్వం చెప్పిన కథను జర్మన్లు నమ్మారా? లేదా? అనే విషయం పక్కనబెడితే బ్రిటిష్ ప్రజలు మాత్రం క్యారెట్లను తినడానికి సిద్ధంగా ఉన్నట్లే కనిపించారు.కొత్త వంటకాల రెసిపీలను, చిట్కాలను అందించే రేడియో కార్యక్రమం 'ద కిచెన్ ఫ్రంట్'ను ప్రజలు అనుసరించేవారు.చక్కెర దొరకడం కష్టంగా మారిన ఆ సమయంలో సహజ స్వీటెనర్ అయిన క్యారెట్‌ను ఉపయోగించి క్యారెట్ పుడ్డింగ్, క్యారెట్ కేక్, క్యారెట్ మర్మలాడ్ వంటి వాటిపై వారు ఆధారపడ్డారు.మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచేలా, బ్లాకవుట్స్ సమయాల్లోనూ మీరు చూడగలిగేలా క్యారెట్లలోని పోషకాలు మీకు సహాయపడతాయంటూ బ్రిటన్ ప్రభుత్వం పోస్టర్లను పంచింది. వార్తాపత్రికల్లో ప్రకటనలు చేసింది.యూకే ఆహార మంత్రి లార్డ్ వూల్టన్, క్యారెట్లపై అవలంబించిన విధానాల గురించి 1942లో న్యూయార్క్ టైమ్స్ పత్రికలో లండన్ ప్రతినిధి రాశారు.''క్యారెట్లను ఆహారంలో భాగం చేయడం ద్వారా బ్రిటిష్ ప్రజలను క్యాబేజీ, బ్రసెల్ స్ప్రౌట్స్ వంటి వాటికి దూరంగా ఉంచేందుకు లార్డ్ ప్రయత్నించారు. బొగ్గు గనుల్లోనూ చూడటానికి సరిపడేంత విటమిన్ ఎ, క్యారెట్లలో ఉంటుందని చెప్పారు'' అని న్యూయార్క్ టైమ్స్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.యుద్ధం నేపథ్యంలో స్వయం సమృద్ధి (సెల్ఫ్ సస్టెనబిలిటీ) అవసరం గురించి ప్రజలతో మాట్లాడుతూ మంత్రి వూల్టన్ నొక్కి చెప్పారు.''ఇది ఆహార యుద్ధం. ఇంట్లో పెంచే కూరగాయలతో షిప్పింగ్‌ను తప్పించుకోవచ్చు. కిచెన్ గార్డెన్ల సహాయం లేకుండా ఈ యుద్ధాన్ని గెలవలేం'' అని అన్నారు.యూకే సమాచార మంత్రిత్వ శాఖ 1941లో క్యారెట్లపై ప్రాపగండా చిత్రాన్ని కూడా విడుదల చేసింది.క్యారెట్లు తింటే కంటి ఆరోగ్యం బాగుంటుందని చాలా పరిశోధనలు సూచిస్తున్నాయి.''క్యారెట్లు మీ కంటి ఆరోగ్యానికి మంచివి అనే సందేశం కాలక్రమంలో 'క్యారెట్లు మీ కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి'గా మారిపోయింది'' అని వరల్డ్ క్యారెట్ మ్యూజియం క్యురేటర్ జాన్ స్టోలార్చెక్ 2013లో ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.జాన్ నిర్వహించే డిజిటల్ మ్యూజియం మొత్తం క్యారెట్లకు సంబంధించిన ఆశ్చర్యకరమైన అంశాలతో ఉంటుంది.బ్లూబెర్రీలు తింటే మనిషి నీలం రంగులోకి మారతాడనడంలో ఎంత నిజం ఉందో క్యారెట్లు తింటే చీకట్లోనూ కళ్లు బాగా కనబడతాయనడంలో అంతే నిజం ఉందని ఆయన అన్నారు.క్యారెట్ల గురించి ఈ ప్రచారం వాడుకలోకి ఎలా వచ్చింది? రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఈ ప్రచార మూలాలు ఎక్కడున్నాయి వంటి అంశాలను ఈ డిజిటల్ మ్యూజియం వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.జర్మన్ వ్యూహకర్తలను బోల్తా కొట్టించేందుకు బ్రిటిషర్లు వేసిన క్యారెట్ ఎత్తులు ఫలించినట్లు తాను అనుకోవట్లేదని జాన్ స్టోలార్చెక్ అభిప్రాయపడ్డారు.''బ్రిటిషర్ల ఎత్తులకు నాజీలు చిక్కినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. కానీ, కంటి ఆరోగ్యానికి క్యారెట్లు మంచివనే భావన జర్మన్లలో కూడా స్థిరపడింది. అయితే, అందులో కొంత నిజం ఉందని భావించిన జర్మన్లు తమ ఫైటర్లకు కూడా క్యారెట్లు తినిపించినట్లు కథలు వాడుకలో ఉన్నాయి'' అని తన పుస్తకం 'హౌ క్యారెట్స్ హెల్ప్‌డ్ విన్ వరల్డ్ వార్ 2'' కోసం మినిస్ట్రీ ఫైల్స్ సమీక్ష అనంతరం స్టోలార్చెక్ ఒక ఈమెయిల్ రాసినట్లు 'ద అట్లాంటిక్' వెబ్‌సైట్ పేర్కొంది.అయితే, ఈ అంశంపై లండన్‌లోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ మ్యూజియం అసిస్టెంట్ క్యురేటర్ బ్రయాన్ లెగెట్ ఒక భిన్నమైన అంశాన్ని వెల్లడించారు.బ్రిటిషర్లు క్యారెట్లను ఉపయోగించి జర్మన్లను మోసం చేయాలని ఎప్పుడూ అనుకోలేదని 2014లో సైంటిఫిక్ అమెరికన్ వార్తా సంస్థతో లెగెట్ చెప్పారు.''మా రాడార్ వ్యవస్థ గురించి జర్మన్ ఇంటెలిజెన్స్ సర్వీస్‌కు మంచి అవగాహన ఉంది. నిజానికి ఒక విమానంలో కమర్షియల్ రేడియోలను అమర్చి వాటిని ఫ్రాన్స్ మీదుగా పంపించి వివిధ రేడియో ఫ్రీక్వెన్సీలను వినడం ద్వారా జర్మన్ ఎయిర్‌బార్న్ రాడార్‌ను ఆర్‌ఏఎఫ్ గుర్తించింది'' అని ఆయన వెల్లడించారు.తమకు విసుగు వచ్చేంతవరకు క్యారెట్లను తినిపించారని కన్నింగ్‌హామ్ తన పుస్తకం ''ద ఫియర్ ఇన్ ద స్కై: వివిడ్ మెమొరీస్ ఆఫ్ బాంబర్ ఎయిర్‌క్రూ ఇన్ వరల్డ్ వార్ టు''లో పేర్కొన్నారు.''క్యారెట్లు తినడం వల్లే నైట్ ఫైటర్ పైలట్లకు రాత్రిపూట కళ్లు బాగా కనిపిస్తాయంటూ తప్పుడు సమాచారం యేట్స్‌బరీలో వ్యాప్తి చెందింది. ఆర్‌ఏఎఫ్ వద్ద రాడార్ ఉందనే వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి ఈ సమాచారాన్ని వ్యాప్తి చేశారు. మా క్లాస్ పైలట్లకే విసుగు వచ్చేంతవరకు క్యారెట్లు తినిపించారు. మిగతా వర్గాలకు ఇలా చేయలేదు. కొన్ని వారాల పాటు ఇది సాగింది'' అని పుస్తకంలో కన్నింగ్‌హామ్ రాసినట్లు వరల్డ్ క్యారెట్ మ్యూజియం పేర్కొంది.రెండో ప్రపంచ యుద్ధం ప్రచారానికి విరుద్ధంగా క్యారెట్లను తింటే రాత్రిపూట పిల్లులకు కనిపించినట్లుగా మానవులకు కళ్లు కనిపించవు.కానీ, రోగనిరోధక శక్తిని పెంచడం, కంటి ఆరోగ్యాన్ని కాపాడటం వంటి ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని హెల్త్‌లైన్ వెబ్‌సైట్ పేర్కొంది.క్యారెట్లలో బీటా కెరోటిన్ అని పిలిచే పిగ్మెంట్ ఉంటుంది. దీన్ని మన శరీరం 'విటమిన్ ఎ'గా మార్చుతుంది.విటమిన్ 'ఎ' తగినంతగా లేకపోవడం వల్ల రేచీకటి రావొచ్చు, లేదా కంటిచూపు కూడా పోవచ్చు.ఏదైనా లోపం (డెఫిషియన్సీ) వల్ల కలిగే దృష్టి లోపాన్ని (పూర్ విజన్) విటమిన్ 'ఎ' తీసుకోవడం వల్ల పూరించుకోవచ్చని అధ్యయనాలు చెబుతున్నప్పటికీ, ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తిలో కంటిచూపును బలోపేతం చేయడం లేదా వయస్సు పెరుగుతున్న కొద్దీ కంటిచూపు మందగించడాన్ని ఇది అడ్డుకోలేదని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

# పారిపోయిన ఐదుగురు బడా వ్యాపారవేత్తలు




కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విజ్ఞప్తి మేరకు వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని బెల్జియంలో అరెస్టు చేశారు. ఆలిండియా రేడియో ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ చేసింది.వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ, ఆయన బంధువు నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి వేల కోట్ల రూపాయల అప్పులు తీసుకుని ఎగ్గొట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.ఈ జాబితాలో మరికొందరు వ్యాపారవేత్తల పేర్లు కూడా ఉన్నాయి. వారు వివిధ కేసుల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిని తిరిగి భారత్ రప్పించడం కోసం దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.మెహుల్ చోక్సీ సహా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు వ్యాపారవేత్తల గురించి ఇక్కడ తెలుసుకుందాం.2018 ప్రారంభంలో, పంజాబ్ నేషనల్ బ్యాంకులో వేల కోట్ల రూపాయల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ సహా అనేక మందిపై బ్యాంకు ఫిర్యాదు చేసింది.నిందితులు బ్యాంకు అధికారులతో కుమ్మక్కై, కుట్రపన్ని బ్యాంకుకు నష్టం కలిగించారని బ్యాంకు ఆరోపించింది.బ్యాంకు అంతర్గత విచారణ పూర్తయిన తర్వాత, 2018 ఫిబ్రవరిలో ఈ మోసం గురించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం అందించింది.మెహుల్ చోక్సీ ఒకప్పుడు భారత వజ్రాల వ్యాపారానికి పోస్టర్ బాయ్.పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన వేల కోట్ల రూపాయల స్కామ్‌లో నీరవ్ మోదీ కూడా నిందితుడిగా ఉన్నారు. 2018 జనవరిలో నీరవ్ భారత్ నుంచి పరారయ్యారు.లండన్‌లోని హోబర్న్‌లో ఉన్న మెట్రో బ్యాంక్ బ్రాంచ్‌లో అకౌంట్ ఓపెన్ చేసేందుకు వెళ్లినప్పుడు, 2019 మార్చి 19న నీరవ్ మోదీ అరెస్టయ్యారు. నీరవ్ మోదీ అప్పగింత కేసు లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టులో 2020 మే నుంచి నడుస్తోంది.నీరవ్ మోదీ కుటుంబం తరాలుగా వజ్రాల వ్యాపారంలో ఉంది. భారత్‌లో రిటైల్ జ్యువెల్లరీ కంపెనీ అయిన గీతాంజలి గ్రూప్ అధిపతి మెహుల్ చోక్సీతో నీరవ్ మోదీ దాదాపు 10 ఏళ్లు కలిసి పనిచేశారు.ఆ తర్వాత, భారత్‌లో ఫైర్‌స్టార్ డైమండ్ అనే కంపెనీని స్థాపించారు.కింగ్‌ఫిషర్ కంపెనీ యజమాని విజయ్ మాల్యా భారతీయ బ్యాంకులకు 9 వేల కోట్ల రూపాయలకు పైగా అప్పు ఉన్నట్లు భారత ప్రభుత్వం చెబుతోంది.కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కంపెనీ కోసం బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకుని, వాటిని తిరిగి చెల్లించకుండా విదేశాలకు వెళ్లిపోయినట్లు మాల్యాపై ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మూతపడింది.విజయ్ మాల్యా 2016 మార్చిలో బ్రిటన్‌కు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన లండన్‌లోనే నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు తిరిగి తీసుకొచ్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు బ్రిటన్ కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నాయి.నిజానికి, భారత్ - బ్రిటన్ 1992లో అప్పగింత ఒప్పందంపై సంతకాలు చేశాయి. కానీ, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరిని మాత్రమే అలా రప్పించారు.ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మాజీ చీఫ్ లలిత్ మోదీ 2010 నుంచి బ్రిటన్‌లో నివాసముంటున్నారు.ఐపీఎల్ చీఫ్‌గా ఉన్న సమయంలో, ఐపీఎల్ వేలంలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని లలిత్ మోదీపై ఆరోపణలు ఉన్నాయి.అయితే, ఈ ఆరోపణలను ఆయన ఖండిస్తూ వస్తున్నారు. మరోవైపు, ఆయన్ను తిరిగి రప్పించడానికి భారత్ ఎన్నో విఫల యత్నాలు చేసింది.2008లో, ఐపీఎల్ ఏర్పాటులో లలిత్ మోదీ కీలకపాత్ర పోషించారు. అది ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఇండస్ట్రీగా మారింది.2010లో, రెండు జట్ల ఫ్రాంచైజీల వేలంలో అవకతవకలకు పాల్పడ్డారనేది లలిత్ మోదీపై ఉన్న ప్రధాన ఆరోపణ. అనుమతులు లేకుండా ప్రసార, ఇంటర్నెట్ హక్కులను విక్రయించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.లలిత్ మోదీ క్రికెట్ వ్యవహారాల్లో పాల్గొనకుండా 2013లో, భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బీసీసీఐ) శాశ్వత నిషేధం విధించింది.బ్యాంకులను రూ.5,700 కోట్లకు మోసం చేయడం, మనీలాండరింగ్ వంటి కేసుల్లో ప్రధాని నిందితుడిగా ఉన్నారు గుజరాత్‌కు చెందిన బడా వ్యాపారవేత్త నితిన్ సందేసరా. స్టెర్లింగ్ బయోటెక్ కంపెనీ యజమాని అయిన నితిన్ జె.సందేసరాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించారు. ఈయనతో పాటు హితేశ్ నరేంద్రభాయ్ పటేల్, దీప్తి సందేసరా, చేతన్ సందేసరా కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.2017లో, కేంద్ర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించడానికి కొద్దిరోజుల ముందు ఈ కుటుంబం భారత్ నుంచి పారిపోయింది. దుబయ్ మీదుగా నైజీరియాకు వెళ్లిపోయింది. సందేసరా కుటుంబం నైజీరియా, అల్బేనియా దేశాల పౌరసత్వం పొందింది.

# మునుపటిలా ఎందుకు రాణించలేకపోతున్నారు?



క్రీడల్లో 2011 నుంచి 2023 వరకు భారత్ బ్యాడ్మింటన్ స్వర్ణయుగాన్ని చూసింది.ఆ సమయంలో ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్ షిప్ లు, బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్, థామస్ కప్ వంటి ప్రధాన టోర్నమెంట్లలో ట్రోఫీలను భారత్ గెలుచుకుంది.భారత బ్యాడ్మింటన్ ప్రస్తుతం మార్పు దశలో ఉంది. ఈ రంగంలోని 'స్వర్ణ యుగం' ఆటగాళ్లు కొందరు రిటైర్ అయ్యారు, ఇంకొందరు రిటైర్మెంట్ గురించి ఆలోచిస్తున్నారు లేదా వారి కెరీర్ చివరి దశలో ఉన్నారు.కొత్త తరం ఆటగాళ్లలో లక్ష్య సేన్ (ప్రపంచ ర్యాంకింగ్ 16), డబుల్స్ ప్లేయర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి (ప్రపంచ ర్యాంకింగ్ 10), ట్రీషా జాలీ-గాయత్రి గోపీచంద్ పుల్లెల (ప్రపంచ ర్యాంకింగ్ 9) తప్ప, మిగతా వారెవరూ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ లో చెప్పుకోదగ్గ ముద్ర వేయలేదు.మాజీ ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధు (ప్రపంచ నంబర్ 17) విదేశాల్లో చివరిసారిగా 2022లో టైటిల్ సాధించారు.జులై 17న సింగపూర్ ఓపెన్ లో ఆమె ఈ టైటిల్ గెలుచుకున్నారు, ఇది వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్.మరోవైపు, లక్ష్యసేన్ చివరిసారిగా 2023 జులై 9న వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్ బీడబ్ల్యూఎఫ్ కెనడా ఓపెన్ లో టైటిల్ గెలుచుకున్నారు.డబుల్స్ లో ప్రపంచ నంబర్ వన్ అయిన సాత్విక్, చిరాగ్ జంట 2024 మే 19న థాయిలాండ్ ఓపెన్ లో తమ చివరి టైటిల్ ను గెలుచుకుంది. ఇది వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్.బ్యాడ్మింటన్ కోచ్ విమల్ కుమార్ ఈ పరిస్థితిపై స్పందిస్తూ "ఇది బలహీనమైన దశ, ఆటలో ఇటువంటి దశలు వస్తూనే ఉంటాయి. ప్లేయర్లు దీనిని ఎదుర్కోవాలి. మనం ఓపికగా ఉండాలి, ప్లేయర్లకు సరైన దిశానిర్దేశం చేయాలి" అని అన్నారు.“బ్యాడ్మింటన్ ప్రపంచంలో బలమైన జట్లలో ఒకటిగా పరిగణించే చైనా కూడా ఈ పరిస్థితికి మినహాయింపు కాదు.చైనా 2018లో బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించింది కానీ, ఊహించిన దానికంటే స్వదేశంలో చాలా తక్కువ విజయాలను సాధించింది.దీంతో చైనా ఎవరూ ఊహించని పని చేసింది. మొదటిసారి ఇద్దరు విదేశీ కోచ్‌లను నియమించింది” అన్నారు విమల్ కుమార్.2020లో చైనా ప్రధాన ప్లేయర్ లిన్ డాన్ రిటైర్ కావడంతో ఆ దేశ కష్టాలు మరింత పెరిగాయి. 2024 వరకు బ్యాడ్మింటన్‌లో చైనా ముద్ర అంతగా లేదు.అయితే, ఇప్పుడు చైనా పుంజుకుంటున్నట్లు కనిపిస్తోంది. వారి స్టార్ ప్లేయర్ షి యు క్వి 2025 మార్చి 16న ప్రతిష్టాత్మక ఆల్-ఇంగ్లాండ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. అతను ప్రస్తుతం ప్రపంచ పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నారు.2024 పారిస్ ఒలింపిక్స్ వైఫల్యం నుంచి భారత బ్యాడ్మింటన్ కోలుకోవడానికి ఇంకా ప్రయత్నిస్తోంది."అవును, పారిస్ ఒలింపిక్స్‌లో ప్లేయర్లు ఆందోళనచెందారు. అది పెద్ద వేదిక. ప్రత్యర్థుల ముందు మన ప్లేయర్ల వ్యూహం పని చేయలేదు, దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితికి వెళ్లిపోయారు, గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిపోయారు" అని మాజీ ప్రపంచ నంబర్ 6 పారుపల్లి కశ్యప్ అన్నారు.సింధు, లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ ఇప్పుడు తమను తాము మళ్లీ నిరూపించుకునే పనిలో ఉన్నారు. ఈ నలుగురు ప్లేయర్లు కోచ్‌ల వద్ద కఠిన శిక్షణ తీసుకుంటున్నారు. 2025 ఆగస్టులో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రాణించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు."ఈ రోజుల్లో ప్రత్యర్థులు మ్యాచ్ ప్రారంభం నుంచే పూర్తి శక్తితో ఎటాక్ చేస్తారు. ఆ ఒత్తిడిని, ఎదురుదాడిని ధీటుగా ఎదుర్కోవడమే లక్ష్యం. గాలి వీచే దిశలో ఆడుతూ ఆటపై నియంత్రణ సాధించినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది" అని విమల్ కుమార్ పేర్కొన్నారు."2025 ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌కు ముందు, లక్ష్యసేన్ వరుసగా రెండు మ్యాచ్‌లలో ప్రపంచ 6వ ర్యాంక్ ఆటగాడు లి షి ఫెంగ్‌ను ఓడించాడు. కానీ, క్వార్టర్ ఫైనల్స్ మొదటి గేమ్‌లో గాలి వీచే దిశలో ఆడుతున్న సమయంలో లక్ష్యసేన్ అనవసరమైన తప్పులు చేశాడు. అవే ఫలితాన్ని నిర్దేశించాయి" అని విమల్ అన్నారు"గత రెండు దశాబ్దాలలో దేశంలోని బ్యాడ్మింటన్ పరిస్థితి మెరుగుపడిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పుడు మనకు మంచి కోచ్‌లు, ఫిజియోలు, శిక్షకులు ఉన్నారు" అని పారుపల్లి కశ్యప్ గుర్తుచేస్తున్నారు."2009లో మాకు ఒకే ఒక ఫిజియో ఉన్నారు, మాతో ఆయన ప్రయాణించలేకపోయారు. ఇక, 2012 లండన్ ఒలింపిక్స్‌లో మొత్తం భారత జట్టుకు ఒకే ఒక ఫిజియో ఉన్నారు" అని చెప్పారు కశ్యప్.సైనా నెహ్వాల్ తన టెక్నిక్, మానసిక బలం, చక్కని శైలితో అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో దేశం ఉనికిని చాటారు. ఆమె 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు, ఒలింపిక్స్‌లో భారతదేశానికి తొలి బ్యాడ్మింటన్ పతకం అదే.ఇక, 2015లో సైనా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని సాధించి, భారత బ్యాడ్మింటన్‌కు ముఖచిత్రంగా మారారు.మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాలా, అశ్విని పొన్నప్ప 2011 లండన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.2017లో శ్రీకాంత్ ఒకే సంవత్సరంలో నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లను గెలుచుకున్నారు. మరుసటి సంవత్సరం, పురుషుల సింగిల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచారు శ్రీకాంత్.అదే సమయంలో పీవీ సింధు మరో విజయవంతమైన క్రీడాకారిణిగా నిలిచారు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2021 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకొని చరిత్ర సృష్టించారు. 2019లో బాసెల్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నారు సింధు.అక్టోబర్ 2023లో సాత్విక్-చిరాగ్ జంట ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది.ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌ను పరిశీలిస్తే.. పురుషుల సింగిల్స్‌లో టాప్-75 ర్యాంకింగ్స్‌లో డజను మంది భారతీయ ప్లేయర్లు ఉన్నారు. వారిలో శ్రీకాంత్, ప్రణయ్‌లకు మాత్రమే 32 సంవత్సరాలు, మిగతా వారందరూ 25 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు గలవారు."కొత్త ఆటగాళ్లలో ప్రియాంషు రాజావత్, కిరణ్ జార్జ్, తరుణ్ మన్నెపల్లి, ఆయుష్ శెట్టి, మన్రాజ్ సింగ్ రాబోయే రోజుల్లో రాణిస్తారని భావిస్తున్నాను" అని కశ్యప్ అన్నారు.మహిళల సింగిల్స్ టాప్-100లో 17 మంది భారత ప్లేయర్లు ఉన్నారు. టాప్-50లో పీవీ సింధు, మాల్వికా బన్సోద్, అనుపమ ఉపాధ్యాయ, రక్షిత శ్రీ, ఆకర్షి కశ్యప్ ఉన్నారు."మన అమ్మాయిలు ర్యాంకింగ్ కోసం కాదు, గెలవాలనే ఉద్దేశంతో ఆడాలి. జపాన్‌కు చెందిన టోమోకా మియాజాకిని చూడండి. ఆమెకు కేవలం 18 సంవత్సరాలు మాత్రమే, అయినప్పటికీ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడవ స్థానంలో ఉన్నారు" అని బ్యాడ్మింటన్ కోచ్ విమల్ కుమార్ అన్నారు.ఐపీఎల్ మాదిరి బ్యాడ్మింటన్‌కూ ఓ లీగ్ ఉండేది. భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈ లీగ్‌ను పునఃప్రారంభించాలి, కార్పొరేట్‌ల నుంచి నిధులు సమకూరేలా చేయాలి."మనం లీగ్‌ను పునఃప్రారంభించగలిగితే, అది భారత ప్లేయర్లకు ఎక్కువగా ఉపయోగపడుతుంది. మన యువ ప్లేయర్లు అంతర్జాతీయ స్థాయి ప్లేయర్లు. కోచ్‌లతో మాట్లాడి, శిక్షణ పొందితే వారు ఇంకా నేర్చుకుంటారు. సాత్విక్, చిరాగ్ కూడా ఈ లీగ్ నుంచి ఎంతో ప్రయోజనం పొందారు" అని విమల్ కుమార్ తెలిపారు."ఈ లీగ్ బాధ్యతను కార్పొరేట్‌లు, ప్రొఫెషనల్ జట్లకు ఇవ్వాలి. చాలామంది విదేశీ ఆటగాళ్లు మన లీగ్‌లో ఆడటానికి సిద్ధంగా ఉన్నారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ కూడా సంవత్సరానికి రెండు నుంచి మూడు వారాల నిర్ణీత కాలపరిమితిని ఇచ్చింది" అని ఆయన చెప్పారు.ఇటీవలి కాలంలో భారత ప్లేయర్లు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లు గెలవలేకపోవడం వల్లే చాలా టైటిళ్లను కోల్పోయారు."టైటిళ్లు గెలవడం ముఖ్యం. మన ఆటగాళ్లలో చాలామంది ర్యాంకింగ్‌ల వెంటే పరిగెత్తుతారు. ఆటగాళ్లు 18, 19 లేదా 20 సంవత్సరాల వయస్సులోనే పెద్ద విజయాలు సాధించడం ప్రారంభించాలి" అని విమల్ కుమార్ అభిప్రాయపడ్డారు.మార్పు కలవరపెట్టేదిగా అనిపించవచ్చు, కానీ ఈ మార్పు చాలా మార్చగలదు.2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో లక్ష్య సేన్, సాత్విక్-చిరాగ్ జంట పతకాలు గెలవగలరని కశ్యప్ అభిప్రాయపడ్డారు.ఎవరికి తెలుసు? ట్రీషా, గాయత్రి జోడీ లేదా మరేదైనా భారత జంటో గెలుపు పోడియంకు చేరుకోవచ్చు.



# భార్య చేతిలో మరో భర్త బలి

- హర్యానాలో మరో ఘోరం
- యూట్యూబర్ సాయంతో భర్తను చంపిన భార్య



**హర్యానా :** భార్యాభర్తల మధ్య సంబంధాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయి. ప్రియుడి మోజులో పడి కట్టుకున్న వాడినే కడతేరుస్తున్నారు. కలకాలం తోడుండాల్సిన వాళ్లే.. అర్థాంతరంగా కాటికి పంపిస్తున్నారు. ఆ మధ్య జరిగిన మీరట్ హత్యా ఘటన మరువక ముందే తాజాగా అలాంటి ఘటనే హర్యానాలో వెలుగులోకి వచ్చింది.రవీనా (32), ప్రవీణ్ (35) భార్యాభర్తలు. హర్యానాలోని హిసార్ జిల్లా ప్రేమ్ నగర్ లో ఉంటున్నారు. అయితే రవీనా.. సురేష్ అనే యూట్యూబర్ తో కలిసి రీల్స్ చేస్తోంది. దీన్ని భర్త ప్రవీణ్ జీర్ణించుకోలేకపోయాడు. రీల్స్ చేయొద్దంటూ భర్తతో పాటు కుటుంబ సభ్యులు వారించారు. ఆమె ఏ మాత్రం లెక్కచేయలేదు. పెడచెవిన పడేసింది. రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో 34, 000 మంది ఫాలోవర్లు పెరిగారు. ఇలా ఏడాదిన్నరగా రీల్స్ చేస్తూ భర్తను ఏ మాత్రం పట్టించుకోకుండా యూట్యూబర్ సురేష్ తోనే కలిసి తిరుగుతోంది.అయితే గత నెల మార్చి 25న రవీనా-యూట్యూబర్ సురేష్ ఒక గదిలో అభ్యంతరకర స్థితిలో భర్త ప్రవీణ్ కు కనిపించారు. ఆ సీన్ చూసి ప్రవీణ్ తట్టుకోలేక పోయాడు. దీంతో రవీనాతో ప్రవీణ్ గొడవకు దిగాడు. అంతే రవీనా-సురేష్ కలిసి ప్రవీణ్ గొంతు కోసి చంపేశారు. అదే రాత్రి తెల్లవారుజామున 2:30 గంటలకు ప్రవీణ్ మృతదేహాన్ని బైక్ పై తీసుకెళ్లి.. ఇంటికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు డ్రైయిన్ లో పడేశారు. అయితే ప్రవీణ్ కుటుంబ సభ్యులు.. రవీనాను ఆరా తీయగా.. తనకు తెలియదని నటించింది. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మార్చి 28న ప్రవీణ్ మృతదేహాన్ని కుళ్లిన స్థితిలో కనుగొన్నారు.ఇక కేసు నమోదు చేసుకున్న పోలీసులు రవీనా ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బాగోతం బయటపడింది. బైక్ పై ప్రవీణ్ మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. తిరిగి అదే బైక్ పై రెండు గంటల తర్వాత వచ్చినప్పుడు మాత్రం రవీనా-సురేష్ మాత్రమే బైక్ పై ఉన్నట్లు కనిపించింది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేయగా.. నేరాన్ని అంగీకరించారు. రవీనా-సురేష్ ను పోలీసులు జైలుకు పంపించారు. ప్రవీణ్ కు ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. అతడు తాత సుభాష్, మామ సందీప్ దగ్గర నివాసం ఉంటున్నాడు.

# అక్రమ వలసదారులకు ట్రంప్ బంపరాఫర్

- అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు
- తాజాగా వారికి ఓ బంపర్ఆఫర్
- ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో



**అమెరికా :** అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు అమలు చేస్తూ వచ్చిన అమెరికా ప్రభుత్వం.. తాజాగా వారికి ఓ బంపర్ఆఫర్ ఇచ్చింది. ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో.. వారికి విమాన టికెట్లతో పాటూ కొంత ఆర్థిక సాయం కూడా చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. హంతకులను అమెరికా నుంచి బయటికి పంపించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.అమెరికాలోని వలసదారులపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ దేశం విడిచివెళ్లేవారికి విమాన ఛార్జీలు, స్టైఫండ్ ను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా యాంకర్ ట్రంప్ కు ఓ వీడియో చూపించారు. ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చాడని, ప్రస్తుతం అతికి పిల్లలు కూడా ఉన్నారని ఆ వీడియో సారాంశం. తాను ఓటు వేయలేక పోయినా, తాను ట్రంప్ కు మద్ధతు ఇచ్చేవాడినని ఆ వ్యక్తి తెలిపారు. ఈ వీడియో చూసిన ట్రంప్.. ఇలాంటి వ్యక్తిని తమ దేశంలో ఉంచుకోవాలని అనుకున్నట్లు చెప్పారు. ఇలాంటి వారి వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా చెప్పారు. వలసదారులను దేశం నుంచి పంపించడమే తమ ప్రథమ లక్ష్యమని, అయితే వారు ఉండడానికి అర్హులని తేలితే.. తిరిగి వెనక్కి తీసుకురావడానికి కూడా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు.స్వీయ బహిష్కరణకు తుది ఉత్తర్వులు పొంది కూడా 30 రోజులు దాటి అమెరికాలో నివసిస్తున్న వారికి రోజుకు 998 డాలర్లు జరిమానాగా విధిస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వీయ బహిష్కరణ వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. స్వతహాగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లడం వెళ్లాలనేకునే వారికి సాయం అందిస్తామని చెప్పారు. తమ దేశాలకు వెళ్లే క్రమంలో చార్జీలను భరించలేకపోతే.. సబ్సిడీ విమాన సర్వీసుకు కూడా అర్హులవుతారని అధికారులు పేర్కొన్నారు.

# ఒడిశాలో సింగరేణి తొలి అడుగు..

- నేడు నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి కాలరీస్ కంపెనీ (SCCL) చరిత్రలో మరో కీలక మైలురాయిగా నేడు ఒడిశాలో నైనీ బొగ్గు గని ప్రారంభమైంది. 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా సింగరేణి సంస్థ ఇతర రాష్ట్రంలోకి అడుగుపెడుతోంది. హైదరాబాద్ నుంచి నైనీ గనిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించనున్నారు. ఈ గని ప్రారంభం ద్వారా సింగరేణి కొత్త దిశలో ప్రయాణం మొదలుపెట్టనుంది. ఈ ప్రాజెక్టు రూపు దిద్దుకోవడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ప్రత్యేక చొరవ కీలకపాత్ర పోషించాయి. తొమ్మిదేళ్ల కల సాకారమవడం సంస్థకు, కార్మికులకు గర్వకారణంగా మారింది.ఈ నైనీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండగా, గని జీవితం 38 ఏళ్లుగా అంచనా వేయబడింది. ఇది ఒక మెగా ప్రాజెక్టుగా భావించవచ్చు. గనిలో వనరుల వినియోగం, ఆర్థిక లాభాల దృష్టితో సంస్థ ఎదుగుదలకు ఇది బలమైన దశగా నిలవనుంది. ఒడిశాలోని నైనీ గని వద్ద నిర్వహిస్తున్న ప్రారంభ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ గని ప్రారంభంతో సింగరేణి సుదీర్ఘ స్వప్నం సాకారమైనందున కార్మికుల మధ్య హర్షాతిరేకాలు నెలకొన్నాయి. ఇతర రాష్ట్రాలలో ప్రభావాన్ని చూపిస్తూ దేశవ్యాప్తంగా విస్తరించే దిశగా సాగుతున్న సింగరేణికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా నిలవనుంది.

# ఆర్థిక సంఘం బృందానికి స్వాగతం పలికిన సీఎం

- 16వ ఆర్థిక సంఘం అధికారులకు స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు..
- కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, సాయంపై ఫైనాన్స్ కమిషన్ కి ప్రజెంటేషన్..
- నాలుగు రోజుల పాటు ఏపీలో పర్యటించనున్న 16వ ఆర్థిక సంఘం బృందం



**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం అధికారులకు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎం చంద్రబాబు స్వయంగా స్వాగతం పలికారు. ఇక, సచివాలయంలోని మొదటి బ్లాక్ లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు లాంటి అంశాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శించి ఆర్థిక సంఘం బృందానికి వివరించారు సీఎం చంద్రబాబు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయం వంటి అంశాలపై ఫైనాన్స్ కమిషన్ బృందానికి ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు.ఇక, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్- 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు సీఎం చంద్రబాబు వివరిస్తున్నారు. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలు, తదనంతర పరిణామాలను వివరించారు. గత ఐదేళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం చేయాలని సీఎం కోరనున్నారు. కేంద్రం తగిన విధంగా కేటాయింపులు చేసేలా ప్రతిపాదనలు ఇవ్వాలని 16వ ఆర్థిక సంఘాన్ని కోరనున్నారు. పనగారియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం బృందం నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు.

# ముస్లిం పెద్దలతో భేటీ కానున్న సీఎం మమత

- ముస్లిం పెద్దలతో భేటీ కానున్న సీఎం మమత
- హింసాత్మక ఘర్షణలపై చర్చించనున్న మమత



**బెంగాల్ :** వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చాక బెంగాల్ లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హింస చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పదుల కొద్దీ గాయాలు పాలయ్యారు. ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ముర్షిదాబాద్ లో హింసాత్మక ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముస్లిం మతాధికారులతో భేటీ కావాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్ణయం తీసుకున్నారు.బుధవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో ముస్లిం మతాధికారులు, ఇమామ్ లు, ముజ్జిన్ లు, ముస్లిం మేధావులతో మమతా బెనర్జీ అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే వక్ఫ్ చట్టాన్ని అమలు చేయమని మమత చెప్పారు. అయినా కూడా అల్లర్లు ఆగడం లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంపాదించుకుంది. ఈ సమావేశాల బాధ్యతను కోల్ కతా మేయర్, ముస్లిం సమాజానికి చెందిన సీనియర్ టీఎంసీ నేత ఫిర్హాద్ హకీమ్ కు అప్పగించారు.ఫిర్హాద్ హకీమ్ మాట్లాడుతూ.. మమత ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం ముస్లిం సమాజానికి ఏం కాదని భరోసా ఇచ్చారు. మైనార్టీలు సురక్షితంగా ఉంటారని హామీ ఇచ్చారు. వీధుల్లో పోరాటం వల్ల ఏ ప్రయోజనం ఉండదని.. సుప్రీంకోర్టులో న్యాయం జరగాలన్నారు.

# స్నాప్ చాట్ లో పరిచయం

- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దారుణం..
- స్నాప్ చాట్ లో పరిచయమైన యువతితో న్యూడ్ కాల్స్ మాట్లాడిన వ్యక్తి..
- న్యూడ్ కాల్స్ స్క్రీన్ షాట్స్ తీసుకుని డబ్బుల కోసం యువతికి బెదిరింపులు..
- నిందితుడు హరీష్ ను పట్టుకుని రిమాండ్ కు తరలించిన పోలీసులు..

**ఆంధ్రప్రదేశ్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన ఒక అమ్మాయికి ఏడాది క్రితం స్నాప్ చాట్ ద్వారా కర్నూలు జిల్లాకు చెందిన పైడిపోగు హరీష్ పరిచయమైయ్యాడు. అయితే, ఇద్దరూ ఫోన్ మాట్లాడుకుంటూ అప్పుడప్పుడూ న్యూడ్ వీడియో కాల్స్ కూడా మాట్లాడుకున్నట్లు సమాచారం. అయితే, న్యూడ్ వీడియో కాల్ మాట్లాడుకునే సమయంలో యువతికి తెలియకుండా స్క్రీన్ షాట్స్ తీసి డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తి డిమాండ్ చేశారు.ఇక, తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో స్క్రీన్ షాట్స్ తీసిన న్యూడ్ ఫోటోలను ఆమె పేరుతో మూడు కొత్త ఇంస్టాగ్రామ్ అకౌంట్స్ ఓపెన్ చేసి వాటిలో న్యూడ్ ఫొటోస్ లను పోస్ట్ చేశాడు కర్నూలు జిల్లాకు చెందిన పైడిపోగు హరీష్. ఇక, ఈ ఘటనపై హరీష్ పై బాధితురాలు ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని.. ఈ మేరకు నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆలమూరు ఎస్ఐ మాట్లాడుతూ.. యువతులు, మహిళలు సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని.. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్ లాంటి పనులు చేయొద్దని సూచించారు.

# సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్

- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ నియామకం
- మే 14న బాధ్యతలు స్వీకరించనున్న గవాయ్
- కేజీ బాలకృష్ణన్ తర్వాత రెండో దళితుడిగా రికార్డ్



**ఢిల్లీ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో తదుపరి చీఫ్ జస్టిస్ గా గవాయ్ పేరును కొలీజియం ప్రాతిపాదించింది. ఇక మే 14న భారత ప్రధాన న్యాయమూర్తిగా బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.జస్టిస్ గవాయ్ నవంబర్ లో పదవీ విరమణ చేయనున్నారు. దాదాపు ఆరు నెలల పాటు భారత ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించనున్నారు. 2007లో దేశంలోని అత్యున్నత న్యాయ పదవికి పదోన్నతి పొందిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టిన రెండవ దళితుడిగా గవాయ్ రికార్డ్ సృష్టిస్తున్నారు.బీఆర్.గవాయ్ పూర్తి పేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1985లో న్యాయవాదిగా బాంబే హైకోర్టు నాగ్ పూర్ బెంచ్ లో ప్రాక్టీస్ చేశారు. అనంతరం ప్రభుత్వ ప్లీడర్ గా మహారాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ ప్రాసిక్యూటర్ గా పని చేశారు. ఇక నవంబర్ 14, 2003న బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మే 24, 2019న సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందారు. దాదాపు బాంబే హైకోర్టులో 16 సంవత్సరాలు పని చేశారు.కేంద్ర న్యాయశాఖ సూచనల మేరకు గవాయ్ పేరును కొలీజియం సిఫార్సు చేసింది. మే 14, 2025 నుంచి నవంబర్ 24, 2025 వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గవాయ్ పని చేయనున్నారు.


# ఔరంగజేబు సమాధిని రక్షించాలి

- ఔరంగజేబు సమాధికి రక్షణ కల్పించాలంటూ ఐక్యరాజ్యసమితికి లేఖ..
- సమాధి దగ్గర ఎటువంటి నిర్మాణాలు చేపట్ట వద్దని లేఖలో పేర్కొన్న యాకూబ్ హబీబుద్దీన్..
- ఔరంగజేబు సమాధికి సెక్యూరిటీ కల్పించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని UNOని కోరిన యాకూబ్

**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాలో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి ఉంది. అయితే, ఈ సమాధిని తొలగించాలంటూ గత కొన్ని రోజులుగా ఆ రాష్ట్రంలో హింసాత్మక నిరసనలు కొనసాగుతున్నాయి. దీంతో నాగపూర్ లో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో మొఘల్ సామ్రాజ్య చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్ వారసుడు యాకూబ్ హబీబుద్దీన్.. ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో గుటెర్స్ కు లేఖ రాశారు. వక్ఫ్ ఆస్తుల కు కేర్ టేకర్ గా ఉన్న ముతావలి ప్రిన్స్ యాకూబ్ హబీబుద్దీన్ తన త న లేఖలో.. ఔరంగజేబులో సమాధికి రక్షణ కల్పించాలని వేడుకున్నారు.అయితే, వాస్తవానికి ఆ సమాధిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన కట్టడంగా ప్రకటించారని యాకూబ్ హబీబుద్దీన్ పేర్కొన్నారు. కానీ, 1958 నాటి ప్రాచీన కట్టడాలు, ఆఆర్కియాల జీ సైట్ల పరిరక్షణ చ ట్టం ప్రకారం.. మొఘల్ సామ్రాజ్య అధినేత ఔరంగ జేబు స మాధి దగ్గర ఎటువంటి నిర్మాణాలు చేపట్ట వద్దని డిమాండ్ చేశారు. సమాధి దగ్గర ఎలాంటి తవ్వకాలు, కూల్చడం, మార్పులు చేయడం లాంటివి చేయరాదని పేర్కొన్నారు. ఔరంగజేబు స మాధి దగ్గర భారీ స్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాల ని యాకూబ్ హబీబుద్దీన్ త న లేఖ లో కోరారు. ఔరంగ జేబు స మాధికి చట్టపరమైన రక్షణ క ల్పించేందుకు భారత ప్రభుత్వానికి, ఆర్కియాల జీ డిపార్ట్మెంట్ కు తక్షణ ఆదేశాలు ఇవ్వాల ని ఆయ న త న లేఖ లో ఐక్యరాజ్య సమితిని కోరారు.


# మావో అగ్ర నేతలు హతం

- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
- మావో అగ్ర నేతలు హతం



**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** ఛత్తీస్ గఢ్ లో మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. కొండగావ్-నారాయణ్ పూర్ సరిహద్దులో బుధవారం తెల్లవారు జామున జరిగిన ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్ట్ అగ్ర నేతలను భద్రతా దళాలు హతమార్చాయి. సంఘటనాస్థలి నుంచి ఏకే 47 తుపాకులతో పాటు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వారి గురించి వివరాలు ఇంకా వెల్లడించలేదు. అయితే ప్రస్తుతం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బస్తర్ ఐజీ పి.సుందరరాజ్ తెలిపారు. మరిన్ని వివరాలు అందాల్సిన అవసరం ఉందని చెప్పారు.ఇదిలా ఉంటే మంగళవారం తెల్లవారుజామున అంబాగఢ్ చౌకీ జిల్లాలో 5 లక్షల రివార్డు ఉన్న ఒక నక్సలైట్ భద్రతా దళాల ముందు లొంగిపోయాడు. 34 ఏళ్ల రూపేష్ మాండవి అలియాస్ సుఖ్ దేవ్ జిల్లాలోని సీనియర్ పోలీసు అధికారుల ముందు లొంగిపోయాడని పోలీసు అధికారులు తెలిపారు.


# ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం సంతృప్తినిచ్చింది



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి సంస్థ చరిత్రలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని, ఈ అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వడం సంతృప్తినిచ్చిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒడిశా లోని నైని బొగ్గు బ్లాక్ ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్చువల్ గా ప్రారంభించారు. దీనిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేంద్రమంత్రి.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చొరవలో తాను భాగస్వామి అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన.. మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రం అవతల బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం సింగరేణి సంస్థ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి వెలుపల మొట్టమొదటిసారి ఒడిషాలోని నైని బ్లాక్ లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించిందని, బొగ్గు ఉత్పత్తిని విస్తరించడం పట్ల, భారత ఇంధన లభ్యత, ఆర్థిక ప్రగతిలో నానాటికీ పెరుగుతున్న తన భాగస్వామ్యం పట్ల సింగరేణి సంస్థకు ఇది గర్వించదగిన క్షణమని హర్షం వ్యక్తం చేశారు.నైని బొగ్గు బ్లాకులో ఉత్పత్తిని ప్రారంభించటానికి ఉన్న అవరోధాలను తొలగించటానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం తరపున, బొగ్గు మంత్రిత్వశాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధిలో భాగమవ్వడం వ్యక్తిగతంగా తనకు సంతృప్తిని కలిగించిందని చెప్పారు. ఇక సింగరేణి సంస్థ తన విజయపరంపరను ఇలాగే కొనసాగించాలని, మరెన్నో మైలురాళ్లను అధిగమించాలని కోరుకుంటూ.. సింగరేణి కుటుంబానికి కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ద్వారకా కోర్టుకు బాంబు బెదిరింపులు

- ఢిల్లీలోని ద్వారక కోర్టుకు బాంబు బెదిరింపులు..
- కోర్టు పరిసరాల్లో డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తనిఖీలు..
- ఎలాంటి పేలుడు పదర్థాలు దొరకలేదు: పోలీసులు




**ఢిల్లీ :** భారత్ లో బాంబు బెదిరింపులు పరంపర కొనసాగుతుంది. తాజాగా ఢిల్లీలోని ద్వారకా న్యాయస్థానానికి బాంబు బెదిరింపులే వచ్చాయి. అయితే, మంగళవారం నాడు రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ మెయిల్ ద్వారా ఈ హెచ్చరికలు వచ్చినట్లు గుర్తించారు. ఇవాళ ( ఏప్రిల్ 16న ) ఉదయం కోర్టు అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబు బెదిరింపుల గురించి నేటి ఉదయం 10:45 గంటల సమయంలో పీసీఆర్ కు కాల్ వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు కోర్టు ఆవరణకు వచ్చేశారు. అక్కడ ఉన్న జనాన్ని ఖాళీ చేయించి బాంబ్ స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ తో కోర్టు ప్రాంగణం మొత్తం క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదని ద్వారకకు చెందిన పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి లోతైన విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఎవరు భయపడ వద్దు.. కోర్టు పరిసరాల్లో ఎలాంటి పేలుడు పదర్థాలు దొరకలేదని తెలిపారు. దీంతో న్యాయమూర్తితో పాటు లాయర్లు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# రౌడీ షీటర్ హత్య కేసులో ఎనిమిది మంది అరెస్ట్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** రౌడీ షీటర్ మసిఉద్దీన్ హత్య కేసును రెయిన్ బజార్ పోలీసులు చేధించారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ రైన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ హత్య జరిగిన విష్యం తెలిసిందే. మసిఉద్దీన్ ను దారుణంగా హత్య చేసిన ఘటనతో నగరంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. అయితే, ఈ కేసును పరిశీలించిన పోలీసులు అతి తక్కువ సమయంలోనే నిందితులను పట్టుకుని కేసును సక్సెస్ ఫుల్ గా ఛేదించారు. ఈ హత్య కేసులో మొత్తం 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు.ఇక ఈ కేసు ప్రాథమిక విచారణలో రంజాన్ పర్వదిన సమయంలో మసిఉద్దీన్ తో నిందితుల మధ్య వివాదాలు తలెత్తినట్లు పోలీసులు గుర్తించారు. అప్పటి నుంచి ద్వేషంతో పాటు భయంతోనూ నిందితులు అతన్ని హత్య చేయాలని తలపెట్టినట్లు సమాచారం. వివాదాల నేపథ్యంలో ఎప్పుడెప్పుడు మసిఉద్దీన్ మళ్లీ తమపై దాడికి దిగుతాడోనని భయంతోనే అతన్ని ముందుగానే హత్య చేశారని పోలీసులు తెలిపారు. ఈ హత్యలో కీలకంగా ఉన్న మహమ్మద్ పాషా షేర్ తో పాటు మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ప్రస్తుతం పోలీసులు మరిన్ని వివరాల కోసం దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# భూభారతి రూల్స్ రిలీజ్

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** భూరికార్డుల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ప్రస్తుతమున్న సమస్యలను పరిష్కరించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తూ భూభారతి రూల్స్ ను ప్రభుత్వం రిలీజ్చేసింది. భూసమస్యలకు ఎక్కడ? ఎలా? ఏ స్థాయిలో పరిష్కారం చూపించాలో గైడ్ లైన్స్ లో స్పష్టంగా పేర్కొన్నది. ఈ మేరకు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ భూభారతి అమలుకు సంబంధించిన మార్గదర్శ కాలను మంగళవారం విడుదల చేశారు.

**ఇతర మ్యుటేషన్లు**

కోర్టు ఆర్డర్, లోక్ అదాలత్ అవార్డు, రెవెన్యూ కోర్టు ఆర్డర్, ప్రభుత్వ అసైన్ మెంట్, భూదాన్, ఇనామ్ రద్దు, ప్రొటెక్టెడ్ టెనెంట్ సర్టిఫికేట్, ల్యాండ్ అక్విజిషన్ కాంపెన్సేషన్ వంటి ఇతర మార్గాల ద్వారా హక్కులు పొందినవారు ఆర్ డీవోకు దరఖాస్తు చేయవచ్చు. ఆధారాలతో అఫిడవిట్, సర్వే మ్యాప్ (కమిషనర్ నోటిపై చేసిన తేదీ నుంచి) సమర్పించాలి.

ఆర్ డీవో నోటీసు జారీ చేసి, 7 రోజుల్లో ఆధారాలు స్వీకరిస్తారు. విచారణ తర్వాత 30 రోజుల్లో స్పీకింగ్ ఆర్డర్ జారీ చేస్తారు.

మ్యుటేషన్ ఆమోదమైతే, రికార్డ్ ఆఫ్ రైట్స్ లో మార్పులు చేసి పాస్ బుక్ జారీ చేస్తారు.

**భూధార్ కార్డు**

రికార్డ్ ఆఫ్ రైట్స్ లో ఎంట్రీ ఉన్నవారికి వివాదాలు లేనట్లు నిర్ధారిస్తే తహసీల్దార్ తాత్కాలిక భూధార్ కార్డు జారీ చేస్తారు.

కమిషనర్ నోటిపై చేసిన తేదీ నుంచి లైసెన్స్ డ్ సర్వేయర్ లాంగిట్యూడ్, లాటిట్యూడ్ లతో భూమి సరిహద్దులను ఖరారు చేస్తారు. ప్రభుత్వ సర్వేయర్ దీన్ని ధ్రువీకరిస్తే, భూమికి యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (భూధార్) ఇస్తారు. ఆ తర్వాత పర్మనెంట్ భూధార్ కార్డు జారీ చేస్తారు.

**పట్టాదార్ పాస్ బుక్ జారీ**

పాస్ బుక్ కోసం భూభారతి పోర్టల్ లో తహసీల్దార్ కు దరఖాస్తు చేయవచ్చు. తహసీల్దార్ రికార్డ్ ఆఫ్ రైట్స్ ను పరిశీలించి, ధ్రువీకరణ తర్వాత పాస్ బుక్ జారీ చేస్తారు.

తహసీల్దార్ స్వయంగా కూడా రికార్డ్ ఆఫ్ రైట్స్ లో ఉన్నవారికి పాస్ బుక్ లు జారీ చేయవచ్చు.

పాస్ బుక్ లో తప్పులు ఉంటే, దరఖాస్తు చేసుకోవచ్చు. తహసీల్దార్ రికార్డులతో సరిపోల్చి సవరణలు చేస్తారు.

**సర్టిఫైడ్ కాపీలు**

రికార్డ్ ఆఫ్ రైట్స్, ఇతర పబ్లిక్ డాక్యుమెంట్ల సర్టిఫైడ్ కాపీల కోసం భూభారతి పోర్టల్ లో దరఖాస్తు చేయవచ్చు.

తహసీల్దార్ డిజిటల్ సంతకంతో కాపీలను జారీ చేస్తారు. ఇవి ఇండియన్ఎవిడెన్స్యాక్ట్-2023, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం- 2000 ప్రకారం చెల్లుతాయి.

# హైదరాబాద్లో మరోసారి డ్రగ్స్ కలకలం

**శేరిలింగంపల్లి ,ఫ్లాష్ ఇండియా :** నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలోని శరత్ సిటీ మాల్ వద్ద భారీ ఎత్తున రంగారెడ్డి జిల్లా టాస్కోఫోర్స్ పోలీసులు డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎస్ కుమారుడు వద్ద నుంచి డిస్ట్రిక్ట్ టాస్కోఫోర్స్ టీమ్ మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. అయితే డీటీఎఫ్ టీం నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. డీటీఎఫ్ టీమ్ తో వాగ్వాదానికి దిగినట్లు చెబుతున్నారు.అయితే అతను ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకువచ్చాడు. ఎవరికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడ న్నదానిపై సంబంధిత అధికారుల ఆరా తీస్తున్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎస్ కుమారుడు కావడంతో.. గోప్యంగా విచారణ జరుపుతున్నట్టు సమాచారం. డ్రగ్స్ పట్టుబడిన విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని గచ్చిబౌలి పోలీసులు, శేరిలింగంపల్లి ఎక్సైజ్ సిబ్బంది చెబుతున్నారు. ఈ ఘటనకు ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. నూతనంగా కొనుగోలు చేసిన నీటి ట్యాంకర్లకు బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, పట్టణంలో నీటి సరఫరాకు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి పట్టణంలో ఇప్పటికే 8 ట్యాంకర్ల ద్వారా ఈ వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉన్న వార్డుల్లో నీటిని సరఫరా చేస్తారని, పట్టణ విస్తీర్ణం పెరగడం, నీటి ఎద్దడి తలెత్తడంతో కొత్తగా 50 లక్షల రూపాయలతో ఐదు నీటి ట్యాంకర్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ వేసవి కాలంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటిని సరఫరా చేసి ప్రజల సమస్యలను తీర్చాలని అధికారులకు సూచించారు. అలాగే 40 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీకి కూడా పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కొనసాగిన తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని మున్సిపల్ బోర్ల నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న వాటిని పరిశీలించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, మున్సిపల్ ఏఈ శంకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# శేరిలింగంపల్లి జోన్ జీహెచ్ఎంసీ పై అవినీతి మరకలు



**శేరిలింగంపల్లి ,ఫ్లాష్ ఇండియా :** ఓ వైపు విమర్శలు, మరోవైపు తీవ్ర ఆరోపణలు. అయినా అనే వారు అంటూనే ఉంటారు. మనం చేయాల్సిన పనిలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు శేరిలింగంపల్లి జోన్ లోని మున్సిపల్ అధికారులు. ఇందులో ఈ శాఖ, ఆ శాఖ అనే తేడాలేదు. అవినీతిలో తాము మాత్రం తక్కువ కాదంటూ ఓ శాఖతో మరో శాఖ పోటీ పడుతున్నట్లుగా ఉంది. అన్ని శాఖల్లోనూ ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ అధికారులు జనాలను పీల్చి పిప్పి చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సిబ్బంది పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు ఉన్నతాధికారులు. అనేవాళ్లు అంటూనే ఉంటారు.. మనం చేసే పని చేసేస్తూ పోవాల్సిందే.. అని ఓ పెద్ద సార్ సింపుల్ లాజిక్ చెప్పారట. ఇంకేముంది సారే అంతమాట అన్నాక మనకెదురేముంది అని రెచ్చిపోతున్నారు జీహెచ్ఎంసీ సిబ్బంది. జీహెచ్ఎంసీలోని అన్ని శాఖల్లోనూ దాదాపు అందరిదీ ఇదే వరస.

**ఏసీబీ కలకలం..**

మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఏసీబీకి చిక్కింది ఎవరు..? ఏ సెక్షన్ లో ఏసీబీ దాడులు జరిగాయి..? టీపీఎస్ లోనా..? ఇంజనీరింగ్ లోనా.. ? రెవెన్యూలోనా..? అన్న చర్చలు జోరుగా సాగాయి. ఒక్కో సెక్షన్ లో ఒక్కో అధికారి గూర్చి పూర్వాపరాలు, వారు చేసిన, చేస్తున్న అవినీతి చిట్టా.. ఎవరి పై ఏసీబీ దాడులు చేసే ఆస్కారం ఉంది.. ఇలా అనేక అంశాల పై మీడియా సర్కిల్ లో జోరుగా ఊహాగానాలు సాగాయి. అధికారులు, కింది స్థాయి సిబ్బంది పనితీరు, వారి అవినీతి వ్యవహారాలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్ ఛాంబర్ లో ఏసీబీ దాడులు నిర్వహించి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్టు వెల్లడైంది. ఇంకా వేరే సెక్షన్ల అధికారుల పై కూడా దాడులకు ఆస్కారం ఉందన్న సమాచారంతో ఆయా సెక్షన్లలో అధికారులు కార్యాలయం నుండి బయటకు వెళ్లిపోయారు. దీంతో జోనల్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి. అసలు శేరిలింగంపల్లి జోనల్ జీహెచ్ఎంసీ పై ఏసీబీ రైడ్స్ ఇవేం కొత్తకాదు.

**అవినీతిలో అన్ని శాఖలు.. జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో**


ఫుడ్ సేఫ్టీ, ఎంటమాలజీ, బర్త్ అండ్ డెత్, ట్రాన్స్పోర్ట్, ట్రేడ్, స్ట్రీట్ లైట్స్, బయోడైవర్సిటీ, స్వయం సహాయక సంఘాలు, ఇంజనీరింగ్, యానిమల్ అస్బెండ్రీ, ఫైర్ సేఫ్టీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఆడిట్, సీడబ్ల్యూఓ శాఖలు ఉంటాయి. వీటిలో జనాలతో సత్సంబంధాలు ఉండి, రెగ్యులర్ గా పనులు ఉండేవి కొన్ని మాత్రమే. మిగతా శాఖల పరిధిలో ఎన్ని పనులు ఉన్నా జనాలకు అంతగా టచ్ లో ఉండరు. కానీ కనిపించని ఆదాయం వెనకేసుకుంటారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ శాఖ పై ఇటీవల ఆరోపణలు రాగా ఆ పెద్ద సార్ ఓ కేంద్ర మంత్రి పీఏతో ఫోన్ చేయించారు అంటే ఆయన రేంజ్ ఏంటో ఇట్టే అర్థం అవుతుంది. ఇక మరో శాఖలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది నేను ఏకంగా ఏసీబీ అధికారులను మేనేజ్ చేస్తున్నా.. మమ్మల్ని ఎవరూ ఏం చేయలేరు అని చెప్పుకు తిరగడం వారి భరోసాకు అద్దం పడుతుంది. కేవలం వీరు మాత్రమే కాదు దాదాపు అన్ని శాఖల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తుంది.

**గతంలో జీహెచ్ఎంసీలో ఏసీబీ దాడులు..**

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కొత్తేమి కాదు. తాజాగా అర్బన్ బయోడైవర్సిటి డిప్యూటీ డైరెక్టర్ విప్పర్ల శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడగా.. గతంలో శేరిలింగంపల్లి సర్కిల్ - 20 కార్యాలయంలో 2020లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ యాదయ్య, అసిస్టెంట్ సాయిలు ఓ వ్యక్తి నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. 2022 ఏప్రిల్ 21న పట్టణ ప్రణాళికాధికారి నరసింహ్మ రాములు పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో తరుచుగా ఏసీబీ రైడ్స్ సాగుతున్నాయి. తాజాగా ఏసీబీ అధికారులు తనిఖీలకు వచ్చారన్న సమాచారంతో జోనల్ కార్యాలయం దాదాపు ఖాళీ కుర్చీలతో దర్శనం ఇచ్చింది. తాత్కాలిక ఉద్యోగులుగా వ్యవహరిస్తున్న కొందరు సిబ్బందిని అడ్డం పెట్టుకుని అధికారులు ఆమ్యామ్యాలు తీసుకుంటున్నారని, తాత్కాలిక సిబ్బందిని నియంత్రించి అవినీతి అధికారుల భరతం పట్టాల్సిన అవసరం ఉందని, శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో తిష్టవేసిన లంచగొండుల పై ఏసీబీ దృష్టి పెట్టాలని ప్రజల నుండి విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

# కంచ గచ్చిబౌలి భూములపై సీఈసీ కీలక నివేదిక

- గచ్చిబౌలి భూముల్లో అటవీ లక్షణాలపై సీఈసీ స్పష్టత
- TGIC పై ఆరోపణలు –పర్యావరణ అంచనా నివేదికను నివారించిన ఆరోపణ
- హైదరాబాదు యూనివర్సిటీ భూములపై అభివృద్ధి పనుల నిలిపివేతకు సూచన



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో గచ్చిబౌలి భూముల విషయంలో పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా కేంద్ర సాధికారిక కమిటీ (సీఈసీ) ఒక కీలక నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో పలు సూచనలు, సిఫార్సులతో పాటు పర్యావరణం, అడవుల పరిరక్షణపై గాఢమైన దృష్టిని వెల్లడించింది. గచ్చిబౌలి భూముల్లో అటవీ లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ చేసిన సీఈసీ, తుది నివేదిక కోసం అటవీ సర్వే అనంతరం నాలుగు వారాల గడువు కోరింది.సీఈసీ నివేదిక ప్రకారం, హైకోర్టు ఆదేశాలు ఇచ్చేవరకు గచ్చిబౌలి భూములపై ఎలాంటి కొత్త నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరాదు. ఇది పర్యావరణానికి గల ప్రమాదాన్ని తక్షణమే నివారించేందుకు తీసుకున్న ప్రాథమిక చర్యగా పేర్కొనవచ్చు. అటవీ లక్షణాలు ఉన్న ప్రాంతాలను గుర్తించడంలో అటవీ శాఖ, పర్యావరణ నిపుణులు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులతో కూడిన కమిటీని పునఃఆయోజించాలంటూ సిఫార్సు చేసింది. అలాగే, గ్రామీణ మరియు పట్టణ భూగతుల మధ్య స్పష్టత తీసుకురావాల్సిన అవసరాన్ని సూచించింది.తెలంగాణ స్టేట్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ కార్పొరేషన్ (TGIC) పర్యావరణ అంచనా నివేదికను (EIA) ఉద్దేశపూర్వకంగా నివారించిందని సీఈసీ ఆరోపించింది. ఇది గచ్చిబౌలి భూముల అభివృద్ధిపై సరైన సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు భావించవచ్చు. దీనిపై TGIC దావాలకు సంబంధించి పూర్తి స్థాయి ఆడిట్ అవసరం అని కమిటీ స్పష్టం చేసింది.గచ్చిబౌలిలో ఉన్న జంతువులు, పక్షులు, సరస్సులు వంటి పర్యావరణ అంశాలు పరిగణనలోకి తీసుకుని ఆ ప్రాంతాన్ని పర్యావరణ రక్షిత ప్రాంతంగా ప్రకటించాలంటూ సిఫార్సు చేసింది. అంతేకాకుండా, చెట్లు తొలగించిన యంత్రాలను జప్తు చేసి, తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో సరైన అంచనా లేకుండా అభివృద్ధి పనులు ప్రారంభించడం సరికాదని సీఈసీ పేర్కొంది. అందువల్ల, అభివృద్ధి కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించింది.భూమిపై హక్కు నిర్ణయించే వరకు టీజీఐసీ చేసే గుత్తేదారీ, లీజు, లావాదేవీలపై స్టే విధించాలని సిఫార్సు చేసిన సీఈసీ.. హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్, యూనివర్సిటీకి మురుగు కలుపుదల 12 నెలల్లో ఆపాలని సూచించింది. భూకబ్జా ఆరోపణలపై ప్రత్యేక విచారణ కమిటీ నియమించాలని సీఈసీ కోరింది.

# ఆంధ్ర పాలనలో తెలంగాణ యాసకు, భాషకు అవమానం

**జగిత్యాల,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలనలో తెలంగాణ యాసకు, భాషకు అవమానం జరిగిందని బీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ భారతదేశ చిత్రపటంలో తెలంగాణకు గుర్తింపు ఇచ్చారని అన్నారు. గులాబీ జెండాపై గెలిచి పార్టీ మారిన నాయకులు వల్ల బీఆర్ఎస్ కు ఎలాంటి నష్టం లేదన్నారు. పాత నీరు పోతే కొత్త నీరు వస్తుందని ఒకసారి వెళ్లిన వారు మళ్లీ పార్టీలోకి వస్తే చేర్చుకునే ప్రసక్తి లేదన్నారు.బీఆర్ఎస్ ను వీడిన సంజయ్ కుమార్ ఎంపీ అరవింద్ తో ఉంటున్నాడని, మరోవైపు కాంగ్రెస్ లో కూడా తిరుగుతున్నాడని, అసలు ఆయన ఏ పార్టీలో ఉన్నాడో తెలియదన్నారు. ఎమ్మెల్యే సంజయ్ ను ప్రజలు పెన్షన్లు, ఉద్యోగాల విషయంలో నిలదీయాలని పిలుపునిచ్చారు. అమలు కానీ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, మహిళలకు ఉచిత బస్సు పథకం ఇచ్చామని చెప్తున్న.. రేవంత్ సర్కార్ కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు.నిజామాబాద్ లో పసుపు బోర్డు కు చట్టబద్ధత లేదని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత బీజెపి, కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రతి గ్రామంలో ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. జగిత్యాల అంటేనే కేసిఆర్.. కేసిఆర్ అంటేనే జగిత్యాల అని మాట్లాడిన కవిత వరంగల్ లో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ మహాసభ విజయవంతం చేయాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ జెడ్పీ చైర్పర్సన్ వసంత ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# విద్యార్థులపై విషప్రయోగం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై విషప్రయోగం

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ పాఠశాలలో విష ప్రయోగం తీవ్ర కలకలం రేపింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంకులో గుర్తుతెలియని దుండగులు పురుగుల మందు కలిపారు. ట్యాంక్ తోపాటు మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందు చల్లారు. ఈ విషయాన్ని సిబ్బంది గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన గ్రామంలో అందరినీ షాక్ కు గురిచేసింది. కాగా ఈ విషప్రయోగం ఘటనపై పోలీసులకు హెచ్ ఎం ప్రతిభ ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. సిబ్బంది గమనించకుంటే విద్యార్థుల పరిస్థితి ఏంటంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

# ఖమ్మం జిల్లాలో దారుణం

- కంట్లో కారం చల్లి మామపై కోడలి దాడి..
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కోడలు



**ఖమ్మం ,ఫ్లాష్ ఇండియా :** ఖమ్మం జిల్లాలో దారుణం జరిగింది. కంట్లో కారం చల్లి మామపై కోడలు దాడి చేసింది. కంట్లో కారం చల్లడంతో ఆ వృద్ధుడు ఆర్తనాదాలు చేశాడు. ఈ దాడికి పాల్పడిన సదరు మహిళ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండటం గమనార్హం. ఆస్తి కోసం మామను అంతం చేయాలని కోడలు పథకం పన్నింది. చెల్లెళ్లతో కలిసి మామపై కోడలు దాడికి పాల్పడింది.పోలీస్ స్టేషన్ లో వృద్ధుడు తన కోడలిపై ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తొమ్మిది పదుల వయసున్న మామ నుంచి రావాల్సిన ఆస్తి కోసం కోడలు ఇంత క్రూరమైన చర్యకు పూనుకుంది. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కోనాయపాలెం గ్రామంలో మామపై కారం చల్లి దాడి చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన కోడలు శారద గురించి తెలిసి స్థానికులు ఆమెను చీత్కరించుకుంటున్నారు.మామ నుంచి సంక్రమించాల్సిన ఆస్తులు రావాలని గత మూడేళ్ల నుంచి ఆ ముసలాయనను కోడలు వేధిస్తుంది. వాంకుడోతు రాములు, -సాలికి ముగ్గురు కుమారులు. సాలి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందగా రాములు కోనాయపాలెంలోని తన నివాసంలోనే ఉంటున్నాడు. రాములు తొమ్మిది పదుల వయస్సులో ఉన్నాడనే కనికరం లేకుండా ఇద్దరు చెల్లెళ్లతో కలిసి వచ్చి రాములుపై దాడి చేసిన ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఏన్కూరు పోలిస్ స్టేషన్ లో నమోదైన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# బీఆర్ఎస్ మండల స్థాయి సన్నాహక సమావేశం



**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** ఈ నెల 27న వరంగల్ లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రత్యేక సన్నాహక సమావేశాన్ని నేడు యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య వెల్లడించారు. బుధవారం యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేశ్ పాల్గొని పలు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు.ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మండలశాఖ నాయకులు, గ్రామశాఖ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థి, యువజన, సోషల్ మీడియా ప్రతినిధులు, పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, పట్టణ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, మండల సెక్రటరి జనరల్ కసావు శ్రీనివాస్, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్, శిఖ శ్రీనివాస్, బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడే మహేందర్, బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఆరే శ్రీదర్, నర్సింగ పురుషోత్తం, శారాజీ రాజేశ్, తుమ్మల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీసీఐలో దరఖాస్తులు

భారత క్రికెట్ నియంత్రణ మండలి టీం ఇండియా (సీనియర్ ఉమెన్)లో రెండు కీలక పదవులకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం సీనియర్ ఉమెన్స్ జట్టులో హెడ్ ఫిజియోథెరపిస్ట్, స్ట్రెంత్ & కండిషనింగ్ కోచ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు ఖాళీలు బెంగళూరులోని అత్యాధునిక BCCI సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఉంటాయి. ఈ జాబ్ కోసం సెలెక్ట్ అయిన వారు. మ్యాచ్ లు, టోర్నమెంట్ ల కోసం టీం ఇండియా (సీనియర్ ఉమెన్)తో ప్రయాణించాల్సి ఉంటుంది. ఇవి స్పోర్ట్స్ సైన్స్ & మెడిసిన్ జట్టుకు అంతర్భాగంగా ఉంటాయి. క్రీడాకారుల పనితీరును మెరుగుపరచడానికి, ప్రభావవంతమైన గాయం నిర్వహణ, నివారణ ప్రోటోకాల్ లను అమలు చేయడానికి అధిక-పనితీరు మద్దతు సేవలను అందిస్తాయి.అర్హత సాధించిన అభ్యర్థులు బహుళ విభాగ వాతావరణంలో పని చేస్తారు. ఈ రెండు పోస్టులు భారత మహిళా క్రికెట్ మొత్తం అభివృద్ధికి దోహదం చేస్తాయి. కాగా పొజిషన్ లకు అప్లై చేసుకునే వారికి.. స్పోర్ట్స్, మస్క్యులోస్కెలెటల్ ఫిజియోథెరపీ/స్పోర్ట్స్ & ఎక్సర్సైజ్ మెడిసిన్/స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ లో ప్రత్యేకత కలిగిన పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత ఫిజియోథెరపీ సేవలలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి. అలాగే మరో పోస్టుకు స్పోర్ట్స్ ఫిజియాలజీ/సైన్స్ లో ప్రత్యేకత కలిగిన అర్హత ఉండాలని బీసీసీఐ ప్రకటించింది. అర్హత కలిగిన వారు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని బీసీసీఐ ప్రకటనలో తెలిపింది.

# షూటింగ్ వరల్డ్ కప్‌లో సౌరభ్‌కు కాంస్యం



పెరులో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్ స్టేజ్ 2లో భారత్ పతక ఖాతా తెరిచింది. భారత షూటర్ సౌరభ్ చౌదరి సత్తాచాటాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్ లో సౌరభ్ 578 స్కోరుతో 7వ స్థానంలో నిలిచి ఫైనల్ కు అర్హత సాధించాడు. భారత్ నుంచి వరుణ్ తోమర్(576) కూడా ఫైనల్ కు చేరుకున్నాడు. ఫైనల్ లో కూడా సౌరభ్ రాణించాడు. 219.1 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. వరుణ్ 198.1 స్కోరుతో నాలుగో స్థానంతో సరిపెట్టాడు.

# సుదీర్మన్ కప్ టోర్నీకి భారత బ్యాడ్మింటన్



చైనాలో ఈ నెలలో జరిగే ప్రతిష్టాత్మక సుదీర్మన్ కప్ బ్యాడ్మింటన్ మిక్స్ డ్ టీమ్ చాంపియన్ షిప్ టోర్నీకి భారత జట్టును బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం ప్రకటించింది. జట్టులో 14 మందిని ఎంపిక చేసింది. మెన్స్ సింగిల్స్ లో లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్, ఉమెన్స్ సింగిల్స్ లో పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ ఎంపికయ్యారు. ఆసియా చాంపియన్ షిప్ కు దూరమైన పురుషుల డబుల్స్ స్టార్ జంట సాత్విక్ - చిరాగ్ శెట్టి తిరిగి వచ్చారు. సాత్విక్ జోడీతోపాటు హరిహరణ్-రుబాన్ కుమార్ జంట పురుషుల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగనుంది. గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ గాయం కారణంగా ఈ టోర్నీకి దూరమైంది. దీంతో యువ జంట ప్రియా-శ్రుతి మిశ్రా జంటకు భారత జట్టులో చోటు లభించింది. మిక్స్ డ్ డబుల్స్ లో ధ్రువ్ కపిల-తనీషా, సతీశ్-ఆద్య జంటలు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ నెల 27 నుంచి మే 4 వరకు టోర్నీ జరగనుంది. భారత్ ను గ్రూపు డిలో చేర్చగా కఠిన ప్రత్యర్థులను ఎదుర్కోనుంది. మాజీ చాంపియన్ ఇండోనేషియా, రెండుసార్లు రన్నరప్ డెన్మార్క్, బలమైన ఇంగ్లాండ్ తో తలపడనుంది.

# ఆగస్టులో బంగ్లా టూరుకు టీమిండియా



భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య వైట్ బాల్ సిరీస్ ఖరారైంది. భారత జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ లో పర్యటించనుంది. ఈ టూరు షెడ్యూల్ ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) తాజాగా ప్రకటించింది. బంగ్లాదేశ్ పర్యటనలో భారత జట్టు మూడు వన్డేలు,మూడు టీ20లు ఆడనుంది. టీమిండియాతో తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ కు బంగ్లాదేశ్ తొలిసారి ఆతిథ్యమివ్వనుంది. వన్డే, టీ20 మ్యాచ్ లకు మీర్పూర్, ఛటోగ్రామ్ వేదికల్లో జరగనున్నాయి. ఆగస్టు 17, 20, 23 తేదీల్లో వన్డే మ్యాచ్ లు జరగనున్నాయి. ఆ తర్వాత ఆగస్టు 26, 29, 31 తేదీల్లో టీ20 పోరులో ఇరు జట్లు తలపడనున్నాయి. 'భారత్ తో సిరీస్ మా హోం క్యాలెండర్ లో ఉత్తేజకరమైన, ఎదురుచూస్తున్న సిరీస్. ఇంటర్నేషనల్ క్రికెట్ లో అన్ని ఫార్మాట్లలో భారత జట్టు బెంచ్ మార్క్ ను నెలకొల్పింది. భారత్, బంగ్లా పోరును ఇరు దేశాల అభిమానులు ఎంజాయ్ చేస్తారు.' అని బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిజామ్ ఉద్దిన్ చౌదరి తెలిపారు. బంగ్లా పర్యటన కోసం ఆగస్టు 13న భారత జట్టు ఢాకాకు చేరుకోనుంది.

# చరిత్ర సృష్టించిన పంజాబ్




ఐపీఎల్ 2025 లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎవరూ ఊహించని జట్లు భారీ విజయాలను అందుకుంటున్నాయి. భారీ స్కోర్ సాధించాల్సిన జట్లు, అతి తక్కువ పరుగులకే పరిమితం అవుతున్నాయి. దీంతో ఐపీఎల్ (ఐపీఎల్) అంటేనే ఇది అని క్రికెట్ అభిమానులు చెబుతున్నారు. కాగా క్రమంలోనే మంగళవారం రాత్రి పంజాబ్, కేకేఆర్ జట్ల జరిగిన మ్యాచ్ మరో చరిత్రను సృష్టించింది. గతంలో ఈ రెండు జట్లు తలపడినప్పుడు ఐపీఎల్ చరిత్రలోనే భారీ స్కోర్ చేసిన జట్టుగా పంజాబ్ నిలిచింది. దీంతో ఈ మ్యాచ్ లోను పరుగుల వరద పారుతుందని అంతా అంచనా వేశారు. కానీ ఎవరూ ఊహించని విధంగా.. మొదటి ఇన్నింగ్స్ లో పంజాబ్ జట్టు కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో కేకేఆర్ 10 ఓవర్లలోనే విజయం సాధిస్తుందని అంతా అంచనా వేశారు.కానీ ఎవరు ఊహించని విధంగా.. పంజాబ్ బౌలర్ల విజృంభించారు. ముఖ్యంగా చాహల్ నాలుగు కీలక వికెట్లు తీసుకొని కేకేఆర్ షాక్ ఇచ్చాడు. అలాగే మార్కో జెన్ సన్ 3 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివర్లో రస్సెల్ క్రీజులో ఉన్నప్పటికి ఆర్షదీప్, జెన్ సన్ లు బౌలింగ్ వేశారు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యల్ప స్కోరుని డిఫెండ్ చేసిన జట్టుగా పంజాబ్ జట్టు చరిత్రలో నిలిచిపోయింది. కాగా గత సీజన్లో ఇదే జట్టుపై పంజాబ్ ఏకంగా 261 పరుగులను చేజ్ చేసి.. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులను చేజ్ చేసిన జట్టుగా చరిత్రను సృష్టించింది. దీంతో నాడు హైయస్ట్ స్కోర్ చేజ్ చేసిన జట్టు.. నేడు అత్యల్ప స్కోర్ డిఫెండ్ చేసుకొని చరిత్ర సృష్టించిందని క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# ప్రత్యర్థులకు క్లాసెన్ వార్నింగ్




వరుసగా దారుణ ఓటములతో డీలాపడిన సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టును చూసి అంతా పనైపోయిందని అనుకున్నారు. బ్యాక్ టు బ్యాక్ 4 పరాభవాలు చూసిన కమిన్స్ సేన.. ఇక కోలుకోవడం అయ్యే పనికాదని డిసైడ్ అయ్యారు. కానీ పడిలేచిన కెరటంలా ఆరెంజ్ ఆర్మీ తాము రేసులోనే ఉన్నామని చాటిచెప్పింది. పంజాబ్ కింగ్స్ తో ఉప్పల్ లో జరిగిన పోరులో 8 వికెట్ల తేడాతో గెలిచి విజయగర్జన చేసింది. ఇదే ఊపులో మరిన్ని మ్యాచుల్లో నెగ్గాలని చూస్తోంది ఎస్ ఆర్ హెచ్. ఈ తరుణంలో ఆ టీమ్ స్టార్ బ్యాటర్ హెన్రిక్ క్లాసెన్ చేసిన ఓ పని ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఇస్తోంది. ఇంతకీ అతడేం చేశాడో ఇప్పుడు చూద్దాం..


**కేన్ మామతో మొదలు..**

కాటేరమ్మ కొడుకును అంటూ క్లాసెన్ మాస్ డైలాగ్ చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్స్.. కాస్కోండ్రా క్లాసెన్ మీకు నరకం చూపించడం గ్యారెంటీ అంటూ అపోజిషన్ టీమ్స్ కు వార్నింగ్ ఇస్తున్నారు. ఇన్నాళ్లూ కాటేరమ్మ కొడుకునని తెలియకుండానే ఆ లెవల్ లో ఆడాడని.. ఇక అర్థం తెలిశాక మరింత రెచ్చిపోవడం ఖాయమని భయపెడుతున్నారు. మొన్న అభిషేక్ సునామీ చూశాం.. నెక్స్ట్ క్లాసెన్ సంభవం పక్కా అని కామెంట్స్ చేస్తున్నారు. కాగా, సన్ రైజర్స్ కు ఆడిన ఆటగాళ్లకు ఇక్కడి అభిమానులు ముద్దుపేర్లు పెడుతుంటారు. గతంలో ఎస్ ఆర్ హెచ్ కు ప్రాతినిధ్యం వహించిన కేన్ విలియమ్సన్ కు కేన్ మామ, డేవిడ్ వార్నర్ కు డేవిడ్ భాయ్ అనే నిక్ నేమ్స్ తో పిలుస్తూ వాళ్లపై ప్రేమను కురిపించారు ఫ్యాన్స్. అలాగే క్లాసెన్ ను కాటేరమ్మ కొడుకు అంటూ పిలుస్తూ వస్తున్నారు.

**కాటేరమ్మ కొడుకు తెలుసా..**

సన్ రైజర్స్ టీమ్ కు సంబంధించిన ఓ ఈవెంట్ లో క్లాసెన్ కు ఓ అనూహ్య ప్రశ్న ఎదురైంది. మిమ్మల్ని ఇక్కడి అభిమానులు ఏమని పిలుస్తారో తెలుసా అని యాంకర్ అడిగింది. దీనికి అతడు తెలియదు అంటూ అడ్డంగా తలూపాడు. దీంతో మిమ్మల్ని కాటేరమ్మ కొడుకు అంటారని యాంకర్ చెప్పింది. ఒకసారి కాటేరమ్మ కొడుకు అనమని యాంకర్ రిక్వెస్ట్ చేయడంతో.. కాస్త సీరియస్ గా కాటేరమ్మ కొడుకు అన్నాడు క్లాసెన్. ఈ డైలాగ్ వినగానే పక్కనే ఉన్న ఇషాన్ నవ్వుల్లో మునిగిపోయాడు. కాగా, రెబల్ స్టార్ ప్రభాస్ సలార్ మూవీలో కాటేరమ్మ సీన్ ఎంతగా వైరల్ అయిందో తెలిసిందే. ఆ సీన్ లో కాటేరమ్మ పేరు చెప్పి విలన్లను ప్రభాస్ ఊచకోత కోయడం సినిమాకు హైలైట్ గా నిలిచింది. అందుకే గ్రౌండ్ లో బౌలర్లను చెడుగుడు ఆడే క్లాసెన్ ను ముద్దుగా కాటేరమ్మ కొడుకు అని పిలుస్తుంటారు ఫ్యాన్స్.

# తండ్రైన టీమిండియా మాజీ పేసర్




టీమ్ ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ తండ్రి అయ్యాడు. ఆయన భార్య సాగరిక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈవిషయాన్ని సాగరిక సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. చిన్నారికి ఫతే సిన్హ్ ఖాన్ అని నామకరణం చేసినట్లు తెలిపారు."ప్రేమ, కృతజ్ఞత, దైవ ఆశీర్వాదాలతో మేము మా చిన్న బాబు ఫతేసిన్హ్ ఖాన్ ను స్వాగతిస్తున్నాము" అంటూ సాగరిక రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఈ జంట ఓ అందమైన ఫొటోను కూడా షేర్ చేశారు. ఫొటోలో జహీర్ ఖాన్ తన బిడ్డను తన ఒడిలో పట్టుకుని ఉండగా..సాగరిక తన చేతులను జహీర్ భుజాల చుట్టూ ఉంచింది.తొలి బిడ్డకు స్వాగతం పలికి ఈ జంటకు పలు రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. కాగా 2016లో తోటి క్రికెటర్ యువరాజ్ సింగ్, హాజెల్ కీచ్ సింగ్ వివాహం సందర్భంగా సాగరిక, జహీర్ ఖాన్ తమ బంధాన్ని బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 2017లో ఈ జంట వివాహబంధంతో ఒక్కటయ్యారు.

# అందుకే నేను రివ్యూ తీసుకోలేదు




ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ దారుణ ఓటమిని చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 15.3 ఓవర్లకు 111 పరుగులకు కుప్పకూలింది. ఛేదనలో కోల్ కతా 15.1 ఓవర్లకు 95 పరుగులకే ఆలౌటై.. 16 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ తన స్పిన్ బౌలింగ్ లో విజృంభించి.. 28 పరుగులిచ్చి కీలక 4 వికెట్లు పడగొట్టాడు. ఇందులో కోల్ కతా కెప్టెన్ అజింక్య రహానే వికెట్ కూడా ఉంది. అయితే జింక్స్ రివ్యూ తీసుకోకపోవడం కోల్ కతా విజయావకాశాలపై ప్రభావం చూపింది.కోల్ కతా ఇన్నింగ్స్ లోని 8వ ఓవర్ యుజ్వేంద్ర చహల్ వేశాడు. అప్పటికే అజింక్య రహానే క్రీజులో కుదురుకున్నాడు. 8వ ఓవర్లోని నాలుగో బంతిని చహల్ గూగ్లీ వేయగా.. రహానే స్వీప్ షాట్ ఆడాడు. బంతి ఎక్కువగా టర్న్ కాకపోవడంతో.. బాల్ జింక్స్ ప్యాడ్లకు తాకింది. చహల్ అపీల్ చేయడంతో.. ఫీల్డ్ అంపైర్ ఔట్ గా ప్రకటించాడు. రహానే రివ్యూకు వెళ్లలేదు. అయితే రిప్లేలో బంతి పిచింగ్ ఔట్ సైడ్ గా కనిపించింది. ఒకవేళ రివ్యూకు వెళ్లి ఉంటే.. రహానేను థర్డ్ అంపైర్ నాటౌట్ గా ప్రకటించేవాడు. దీనిపై మ్యాచ్ అనంతరం రహానే మాట్లాడుతూ.. రివ్యూను సేవ్ చేయాలని తీసుకోలేదన్నాడు.'నేను రాంగ్ షాట్ ఆడాను. బంతి పిచింగ్ మిస్ అయిందనేది అంగ్ క్రిష్ రఘువంశీకి ఖచ్చితంగా తెలియదు. నాకు కూడా ఖచ్చితంగా తెలియదు. అంపైర్ కాల్ కావచ్చని రఘువంశీ చెప్పాడు. ఆ సమయంలో నేను అవకాశం తీసుకోకూడదనుకున్నాను. రివ్యూను సేవ్ చేయాలనుకున్నా. కీలక సమయంలో ఉపయోగపడుతుందనుకున్నా. ఒకవేళ నేను రివ్యూ తీసుకుంటే అనవసరంగా కోల్పోతాం అనుకున్నా. అందుకే రివ్యూ తీసుకోలేదు. మైదానం బయటికి వెళ్లాక చూస్తే బంతి పిచింగ్ ఔట్ సైడ్ గా కనిపించింది' అని అజింక్య రహానే చెప్పాడు. జింక్స్ 17 బంతుల్లో 17 రన్స్ చేసి అవుట్ అయ్యాడు.

# చహల్‌కు శ్రేయస్ దిశానిర్దేశం



ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం కోల్ కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) సంచలన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసి 111 పరుగులే చేసినా.. కోల్ కతాను 95కే ఆలౌట్ చేసి 16 రన్స్ తేడాతో అద్భుత విజయాన్ని ఖాతాలో వేసుకుంది. పంజాబ్ విజయంలో టీమిండియా మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ కీలక పాత్ర పోషించాడు. చహల్ తన స్పిన్ మాయాజాలంతో కేవలం 28 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అద్భుతంగా బౌలింగ్ చేసిన యూజీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో మ్యాచ్ విజయం అనంతరం పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.తాను బ్యాటింగ్ కు వచ్చిన సమయంలో బాల్ కాస్త టర్న్ అవడాన్ని గమనించా అని, యుజ్వేంద్ర చహల్ ను శ్వాస మీద కాస్త నియంత్రణ సాధించు అని చెప్పానని శ్రేయస్ అయ్యర్ చెప్పాడు. 'నేను బ్యాటింగ్ కు వచ్చిన సమయంలో బంతి కాస్త టర్న్ అవుతోంది. మేము ఫీల్డింగ్ చేసేటప్పుడు నేను చహల్ ను శ్వాస మీద నియంత్రణ సాధించు, కాస్త కూల్ గా ఉండని చెప్పా. కచ్చితత్వంతో బంతు లేసి కేకేఆర్ బ్యాటర్లను అటాక్ చేయాలని సూచించా. చహల్ బంతిని తిప్పాడో మాకు విజయంపై విశ్వాసం కలిగింది. అదే సమయంలో నేను అటాకింగ్ ఫీల్డ్ సెట్ చేశా. బ్యాటర్లకు దగ్గరగా ఫీల్డర్లను మోహరించడంతో ఒత్తిడిలో తప్పులు చేసి వికెట్ ఇచ్చారు' అని శ్రేయస్ తెలిపాడు.'నేను బ్యాటింగ్ కు వెళ్లినప్పుడు బంతి విభిన్నంగా స్పందించింది. ఓ బాల్ ఎక్కువ బౌన్స్ రావడం, మరో బంతి నా బ్యాట్ కిందకు వచ్చింది. నేను మాత్రమే కాదు మిగతా బ్యాటర్లు కూడా స్వీప్ షాట్ ఆడటానికి ఇబ్బంది పడ్డారు. నిపిచ్ పరిస్థితులను బట్టి చూస్తే మేం చెప్పుకోదగ్గ స్కోరే చేశాం. పిచ్ పై బంతి ఒక్కోసారి ఒక్కోలా వస్తోందని మా బౌలర్లకు వివరించా. వారు అద్భుత బంతులు వేశారు. రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడగానే విజయంపై ఆశలు రేకెత్తాయి. చహల్ రాకతో మరింత విశ్వాసం కలిగింది. ప్రతి ఒక్కరు బాగా ఆడారు. ఈ విజయంతో మేం పొంగిపోం. ఈ గెలుపు మాలో మరింత బాధ్యతను పెంచింది. ఇదే స్ఫూర్తితో తర్వాతి మ్యాచ్ లోనూ విజయం సాధిస్తాం' అని శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు.

# మళ్లీ ఇప్పుడు రీ ఎంట్రీ



చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ స్టార్ట్ చేసి స్టార్ హీరోయిన్ రేంజ్ కి ఎదిగిన హన్సిక గురించి స్పెషల్ గా చెప్పనక్కర్లేదు. ఈ బ్యూటీ తెలుగులో అల్లు అర్జున్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'దేశ ముదురు' సినిమాతో గ్రాండ్ గా ఎంట్రీ ఇచ్చింది. తన అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. అయితే ఈ మూవీ బ్లాక్ బస్టర్ కావడంతో హన్సిక చాలా ఏళ్ళు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది.

అలా కందిరీగ, పవర్, బిందాస్, మస్కా, బిల్లా లాంటి సినిమాలతో క్రేజ్ తెచ్చుకుంది. టాలీవుడ్ లోనే కాకుండా ఈ అమ్మడు బాలీవుడ్ లో కూడా హీరోయిన్ గా 'ఆప్ కా సురూర్'సినిమాతో మంచి హిట్ అందుకుంది. అలాగే తమిళంలో కూడా కొన్ని సినిమాలు చేసి సక్సెస్ లు అందుకుంది. కానీ సడెన్ గా ఏమైందో ఏమో కానీ సినిమాలకు దూరమైంది.ఇక కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. మళ్లీ ఇప్పుడు రీ ఎంట్రీ ఇచ్చి పలు షోలకు జడ్జ్ గా వ్యవహరిస్తుంది.అలా తెలుగులో ప్రసారమయ్యే డ్యాన్స్ షో అయినటువంటి 'ఢీ' షోకి జడ్జ్ గా వ్యవహరిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టీవ్ గా ఉంటూ తన అందచందాలతో అదరహో అనిపిస్తోంది. ఈ క్రమంలో ఈ భామ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా హన్సిక తన ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోస్ షేర్ చేసింది.అందులో మిక్సింగ్ కలర్ చీర ధరించింది. అలాగే నడుమ అందాలతో రెచ్చగొడుతుంది. వయ్యారంగా వాలు కళ్లతో చూస్తూ వావ్ అనిపిస్తుంది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు అవుట్ డేటెడ్ ఆంటీ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు ఈ భామ పోస్ట్ పై ఓ లుక్ వేసేయండి.

# మరోసారి పోస్ట్ పోన్..?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు. యంగ్ డైరెక్టర్ జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. అత్యంత భారీ బడ్జెట్ పై పీరియాడిక్ సినిమాగా తెరెక్కుతుంది. దాదాపుగా ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ సినిమా ట్రైలర్, పోస్టర్స్ సినిమాపై బజ్ ను పెంచాయి.కాగా ఈ సినిమాను మొదట ఈ ఏడాది మార్చి 28న వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ షూటింగ్ అప్పటికి ఫినిష్ అవకపోవడంతో విడుదల వాయిదా వేశారు. ఆ తర్వాత మే 9న రిలీజ్ చేస్తామని మరో డేట్ ప్రకటించారు. అయితే ఇప్పుడు వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆ డేట్ కు హరిహర వీరమల్లు రిలీజ్ వాయిదా వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికి ఈ సినిమాకు సంబందించి కొన్ని కీలకమైన సీన్స్ పెండింగ్ ఉన్నాయని పవన్ కళ్యాణ్ పొలిటికల్ బిజీ షెడ్యూల్ కారణంగా హరిహర వీరమల్లు ఫినిష్ అవలేదని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే పలుమార్లు రిలిజ్ వాయిదా వేసిన ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో మేకర్స్ కు కూడా సరైన క్లారిటీ లేదని సోషల్ మీడియాలో కామెంట్స్ వినిపిస్తున్నాయి.



# హాట్ అండ్ క్యూట్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్ ఎక్స్-100' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఈ భామ.. తన ఫస్ట్ మూవీతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అయితే వరుస సినిమాల్లో నటించినప్పటికీ ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంత స్టార్ డమ్ అయితే రాలేదు. ఇక చివరగా యాక్ట్ చేసిన 'మంగళవారం' మూవీ మాత్రం బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దీంతో ఈ బ్యూటీ ఓవర్ నైట్ స్టార్ రేంజ్ కి వెళ్లిపోతుంది అనుకున్నారు కానీ ఇక్కడ కూడా సేమ్ సీన్ రిపీట్. ప్రస్తుతం 'వెంకట లచ్చిమి' అనే సినిమాలో నటిస్తోంది. ఇక దీనికి ముని దర్శకత్వం వహిస్తుండగా.. ఈ చిత్రం ఏకంగా ఆరు భాషల్లో రిలీజ్ కాబోతుంది.ఇదిలా ఉంటే..నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ లేటెస్ట్ ఫొటోస్, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ అమ్మడు పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా పాయల్ తన ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ షేర్ చేసింది. అందులో బోల్డ్ డ్రెస్ లో ఎద అందాలు చూపిస్తూ క్లాత్ ని ఐరన్ చేస్తుంది. ఇక వీటికి "మీ హృదయం ఎల్లప్పుడూ మిమ్మల్ని నడిపించనివ్వండి" అనే క్యాప్షన్ జోడించండి. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు హాట్ అండ్ క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# కార్తీకి తలనొప్పిగా మారిన డైరెక్టర్



20 ఏళ్లలో 25 ఫిల్మ్స్ చేసి కెరీర్ ను ఓ పద్ధతిగా ప్లాన్ చేసుకుంటున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో కార్తి. మంచి కంటెంట్ చిత్రాలను చూజ్ చేసుకుంటూ దూసుకెళ్తున్నాడు. ఈ దూకుడుకు బ్రేకులు వేస్తున్నాడు డైరెక్టర్ నలన్ కుమారసామి. సూదు కవ్వం, కాదలుం కడందు పోగుమ్ చిత్రాల తర్వాత ఖాళీగా ఉంటున్న నలన్.. స్టోరీ నచ్చి కార్తి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. 2023లో ఈ ఇద్దరి కాంబోలో సినిమా స్టార్ట్ అయ్యింది. కార్తి 26గా 2023లో ప్రారంభమైన ఈ సినిమాకు లాస్ట్ ఇయర్ మేలో.. వా వాత్తియార్ అనే టైటిల్ ఫిక్స్ చేశారు. కార్తిని పోలీస్ ఆఫీసర్ గా సరికొత్త గెటప్ లో చూపించబోతున్నాడు దర్శకుడు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. అయితే ఈ సినిమా కంటే వెనుక స్టార్ట్ అయిన కార్తి 27 సత్యం సుందరం ఇప్పటికే రిలీజై క్లాసిక్ హిట్ అందుకుంది.అలాగే సర్దార్ 2 కూడా శరవేగంగా షూటింగ్ జరుపుకుని ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కానీ వా వాత్తియార్ మాత్రం కంప్లీట్ కాలేదని టాక్. ఇంకా 20 రోజుల షూటింగ్ పెండింగ్ లో ఉందని కోలీవుడ్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. షూటింగ్ డిలేపై నిర్మాత కూడా నలన్ పై గుర్రుగా ఉన్నాడన్నది బజ్. ఇప్పటికే అప్ కమింగ్ ప్రాజెక్టుల కోసం దర్శకులను లైన్ లో పెట్టేస్తుంటే.. వా వాత్తియార్ కంప్లీట్ కాకపోవడంతో నెక్స్ట్ ప్రాజెక్టులపై కార్తి ఫోకస్ చేయలేకపోతున్నాడట. డైరెక్టర్ తమిళ్ తో కార్తి 29 ఎనౌన్స్ చేశాడు. లోకేష్ కనగరాజ్ ఖైదీ 2 ఉంటుందని వెల్లడించాడు. ఇవే కాకుండా మారి సెల్వరాజ్, హెచ్ వినోద్, వాసుదేవ్ మీనన్ తో కొలాబరేట్ కాబోతున్నాడన్నది బజ్. కానీ వా వాత్తియార్ సెట్స్ పైనే ఉండటంతో వీటికి షిఫ్ట్ కాలేని పరిస్థితి. ఈ బొమ్మను జనవరిలో రిలీజ్ చేద్దామనుకుంటే.. షూటింగ్ కంప్లీట్ కాలేదు. ఇప్పుడు జూన్ లో అనుకుంటే.. అప్పుడు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదట. ఇదే నిజమైతే సర్దార్ 2 తర్వాతే అనేది కోలీవుడ్ టాక్. ఇప్పటికే సర్దార్ 2 పోస్ట్-ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ బొమ్మను సెప్టెంబర్ 5కి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. మరి వా వాత్తియార్ ను నలన్ ఎప్పుడు కంప్లీట్ చేసి ప్రేక్షకుల ముందుకు తెస్తాడో? కార్తికి ఎప్పుడు టెన్షన్ తగ్గిస్తాడో..? చూడాలి మరి.

# ట్రోల్స్ పై స్పందించిన విజయశాంతి



ఇటీవల సింగపూర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయట పడిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సతీమణి అన్నా లెజినోవా పద్మావతి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. స్వామి వారి దర్శనానంతరం అన్నా లెజినోవా తన కుమారుడు కొణిదెల మార్క్ శంకర్ పేరిట రూ. 17 లక్షల విరాళాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అందించారు. తర్వాత నిత్యాన్నదాన సత్రం లో శ్రీవారి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి, భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు అన్నా. దీనికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. అయితే కొంత మంది అన్నా తలనీలాలు ఇవ్వడం పై ట్రోల్స్ చెస్తున్నారు.. సనాతనంలో మహిళలు పుణ్యక్షేత్రాల వద్ద తలనీలాలు సమర్పించడం సరైంది కాదంటున్నారు. అయితే ఈ మాటలపై సీనియర్ నటి విజయశాంతి స్పందించారు.' దేశం కాని దేశం నుంచి వచ్చి, పుట్టుకతో వేరే మతం అయినప్పటికీ హిందూ ధర్మాన్ని విశ్వసించిన మహిళ, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ గారి సతీమణి అన్నా లెజినోవా గారిపై కొందరు కామెంట్ చేస్తూ ట్రోల్ చేయడం అత్యంత అసమంజసం. అనూహ్యంగా జరిగిన దురదృష్టకర అగ్ని ప్రమాదం నుంచి వారి కుమారుడు బయటపడేందుకు, ఆ విశ్వాసాన్ని నిలబెట్టిన నిలువెత్తు దైవం మన శ్రీ వేంకటేశునికి కృతజ్ఞత గా తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తల నీలాలిచ్చి, అన్నదానం ట్రస్ట్ కు విరాళం సమర్పించి సేవ కూడా చేశారు. సంప్రదాయాన్ని గౌరవించిన అన్నా లెజినోవా గారిని కూడా ట్రోల్ చేసేవారిని తప్పు అని చెప్పక తప్పడం లేదు' అంటూ ట్వీట్ చేసింది.

# విజయ్ స్టార్ హీరో కాదు



విజయ్ దేవరకొండ అంటే టాలీవుడ్ లో మంచి క్రేజ్ ఉన్న హీరో. హిట్, ప్లాపుల సంగతి పక్కన పెడితే.. అతను వరుస సినిమాలతో మంచి క్రేజ్ తెచ్చుకుంటున్నాడు. అలాంటి విజయ్ మీద తాజాగా బాలీవుడ్ లోని ప్రముఖ మీడియా జర్నలిస్ట్ హిమేశ్ మన్కడ్ చేసిన కామెంట్లు పెద్ద దుమారమే రేపుతున్నాయి. ఆయన మాట్లాడుతూ.. 'విజయ్ దేవరకొండ మీద బాలీవుడ్ మీడియా చేసిన ప్రచారం చూసి చాలా షాక్ అనిపిస్తోంది. లైగర్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో ఆయన్ను పెద్ద సూపర్ స్టార్ అన్నట్టు బాలీవుడ్ మీడియాలో చూపించింది. కానీ టాలీవుడ్ కు వచ్చి చూస్తే అతను ఇక్కడ స్టార్ హీరో కాదు. టైర్-2 హీరో మాత్రమే' అంటూ కామెంట్ చేశాడు.'విజయ్ ఇప్పటి వరకు 12 సినిమాలు తీస్తే అందులో 9 ప్లాప్ అయ్యాయి. అతని లైగర్ మూవీకి భారీ కలెక్షన్లు వచ్చాయని ప్రచారం చేశారు. కానీ రియల్ గా చూస్తే రూ.20 కోట్లు కూడా రాలేదు. అలాంటి విజయ్ ను సల్మాన్ ఖాన్ తో పోల్చారు. సల్మాన్ ఖాన్ ప్లాప్ మూవీ కూడా రూ.100 కోట్లు వసూలు చేస్తుంది. విజయ్ ను సల్మాన్ తో ఇంకెప్పుడూ పోల్చుకోవద్దు' అంటూ హిమేశ్ తీవ్ర మైన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ ఫ్యాన్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విజయ్ సొంతంగా ఎదిగాడని.. అలాంటి వ్యక్తిని సపోర్ట్ చేయకున్నా.. ఇలా అక్కసు వెల్లగక్కడం మంచిది కాదంటూ చురకలు అంటిస్తున్నారు. విజయ్ కు సరైన హిట్ పడితే తానేంటో ప్రూవ్ చేసుకుంటాడు అంటూ చెబుతున్నారు.

# పక్కా హిట్ ఇస్తా



అక్కినేని అఖిల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చివరగా 'ఏజెంట్' సినిమాలో నటించి భారీ డిజాస్టర్ ను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఇప్పుడు మళ్లీ 'లెనిన్' సినిమాతో ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇస్తున్నాడు. ఇక దీనికి కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. ఇక రీసెంట్ గా ఈ మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది.ఇదిలా ఉంటే.. లెనిన్ సినిమాలోని శ్రీ లీల, అఖిల్ పోస్టర్ పై సోషల్ మీడియాలో తెగ ట్రోల్ అవుతోంది. ఇందుకు సంబంధించిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. అందులో శ్రీ లీల నీకు నేను హిట్ ఇస్తా గురు అని చెబుతున్నట్టు ఎడిట్ చేయగా.. కింద బ్రిటిష్ పోలీసులు ఈ కాంబో చూస్తుంటే నాకు భయమేస్తుంది అంటున్నట్లు మీమ్ క్రియేట్ చేశారు.ఇక ఈ పోస్ట్ కింద నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అప్పట్లో బ్యాచిలర్ మూవీతో పూజ దొబ్బేసింది.. ఇప్పుడు శ్రీలీలనా అని, నీకే హిట్ కు గతి లేదు అఖిల్ కి ఏం ఇస్తావ్ అని, శ్రీలీలను చూస్తుంటే మహేష్ బాబుకు లేడీ గెటప్ వేసినట్లు ఉంది అని, ఇది కూడా పక్కా ప్లాప్ అని తెగ ట్రోల్ చేస్తున్నారు. మరి ఈ సినిమా కనుక హిట్ అయితే వీరందరి నోరు మూయించినట్టే అవుతుంది.

# ఫైనల్లీ క్రేజీ కాంబో ఫిక్స్



వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్ లో వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్' 'మల్లీశ్వరి' సినిమాలు ఎంతగా విజయం సాధించాయో మనందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రాల తర్వాత మళ్లీ వీరిద్దరి కాంబోలో మరో సినిమా రాలేదు. దీంతో త్రివిక్రమ్ డైరెక్షన్ లో వెంకటేష్ హీరోగా ఒక సినిమా రావాలని ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే..'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ అల్లు అర్జున్ తో ఓ సినిమా చేయాలి. కానీ మధ్యలో బన్నీ.. అట్లీ ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లాడు. కాబట్టి త్రివిక్రమ్ కి కొంత టైం దొరికింది. ఈ గ్యాప్లో అతను ఓ మిడ్ స్కేల్ ప్రాజెక్ట్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఫ్యామిలీ ఎంటర్టైనర్లు తీయడం త్రివిక్రమ్ కి వెన్నతో పెట్టిన విద్య లాంటిది. కానీ వాటిని ఎక్కువగా రిపీట్ చేస్తున్నాడు అనే కంప్లైంట్ కూడా ఉంది. అయితే ఈ షార్ట్ గ్యాప్లో అలాంటి ప్రాజెక్టు మాత్రమే త్రివిక్రమ్ చేయగలరు. అందుకే వెంకటేష్ తో మూవీ చేయాలని అనుకుంటున్నాడట.ఈ క్రమంలో దాదాపు 20 సంవత్సరాల ప్రణాళిక తర్వాత.. వెంకటేష్, త్రివిక్రమ్ ఫైనల్ గా ఒక ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న మూవీలో పనిచేస్తున్నారు. అయితే వెంకటేష్ కు త్రివిక్రమ్ ఈ కథ గురించి వినిపించగానే వెంకీ మామకు ఫుల్ గా నచ్చేసి వెంటనే ఓకే చెప్పాశాడట. అంతేకాకుండా ఈ మూవీలో అతని పాత్రను అతని కోసమే ప్రత్యేకంగా రూపొందించారని తెలుస్తోంది. ఇక చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబో త్వరలో బిగ్ స్క్రీన్ మీదకు రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**